ప్రజాశక్తి
ఆదివారం 20 ఆగస్టు 2023
8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

సర్పంచ్‌గా విజయం సాధించిన దూర్జో, వార్డు మెంబర్‌గా గెలిచిన నాయుడు నానాజీ

# ప్రశాంతంగా ఉప ఎన్నికలు

## చెరో రెండు చోట్ల వైసిపి, టిడిపి బలపరిచిన అభ్యర్థులు సర్పంచ్‌లుగా విజయం

ఉమ్మడి విశాఖ జిల్లాలో శనివారం సర్పంచ్, వార్డు సభ్యుల ఉప ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం కొరుప్రోలు సర్పంచిగా టిడిపి బలపరిచిన కర్రి సూరివేణి, అల్లూరి జిల్లా జికె.వీధి మండలం సీలేరు సర్పంచిగా వైసిపి బలపరిచిన పాంగి దూర్జో, పెదబయలు మండలం పెదకోడాపల్లి సర్పంచిగా వైసిపి బలపరిచిన బి.చిట్టిబాబు, హుకుంపేట మండలం శోభపేట సర్పంచిగా టిడిపి బలపరిచిన శశిభూషణ నాయుడు గెలుపొందారు. వార్డు స్థానాల్లో వైసిపి అభ్యర్థులు ఎక్కువ చోట్ల విజయం సాధించారు.

(పూర్తి వివరాలు లోపలి పేజీల్లో..)

# సర్దుబాట్లు.. విద్యార్థులకు పాట్లు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ప్రయివేటు పాఠశాలలను తలదన్నేలా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతుంటే, విద్యార్థులను ఆకర్షించేలా మౌలిక వసతులు కల్పిస్తుంటే, తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలన్న ఆలోచనలో తల్లిదండ్రులు పడేలా ముస్తాబు చేస్తుంటే... విద్యకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని అంతా అనుకున్నారు. భౌతిక మార్పును చూసి భ్రమ పడ్డారు. ఒక విధంగా చెప్పాలంటే బలివ్వడానికి ముందు మేకను తయారుచేసిన కసాయిలా, లక్షలు ఖర్చు పెట్టి పాఠశాలల రూపురేఖలను ప్రభుత్వం మార్చింది. మేకను తయారుచేసిన కసాయిని మెచ్చుకున్నట్లే, నాడు - నేడు కింద పాఠశాలలను తీర్చిదిద్దుతున్న ప్రభుత్వాన్ని గిట్టనివారు సైతం మెచ్చుకున్నారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడానికి దిగొచ్చిన ప్రభుత్వంగా చెప్పుకున్నారు. ఎవరికి తోచిన రీతిలో వారు వర్ణించారు. ఇదంతా నాణేనికి ఒకవైపు. రెండోవైపు చూస్తే, తన కసాయి తనం బయటపడకుండా మేకను తయారు చేసినట్లు ప్రభుత్వ విద్యను చాపలా చుట్టడానికి ముందు ప్రభుత్వ పాఠశాలలను ఈ సర్కారు తయారుచేసింది. ఒక రకంగా నిర్మాణ పనులకు సామగ్రిని పంపిణీ చేసే కాంట్రాక్టు తీసుకొని లాభపడింది. ఆ పనులు పూర్తయ్యాక ఆ పాఠశాలలపైన విరుచుకుపడుతోంది.

నూతన విద్యా విధానం పేరుతో తీసుకున్న నిర్ణయాలు విద్యా వ్యవస్థను భ్రష్టుపట్టించేలావున్నాయి. అందుబాటులో వున్న ప్రాథమిక విద్యను దూరం చేస్తోంది. విద్యపై పెడుతున్న ఖర్చును తగ్గించుకోవాలని చూస్తోంది. భవిష్యత్తులో డిఎస్‌సి నోటిఫికేషన్ ఇవ్వకుండా మిగులు ఉపాధ్యాయులను తేల్చే పనిలో వుంది. 2022 ఆగస్టు 31 నాటికివున్న పాఠశాలల్లో విద్యార్థి నిష్పత్తి ప్రకారం ఈ ఏడాది జూన్‌లో హేతుబద్ధీకరించి ఉపాధ్యాయులను ప్రభుత్వం బదిలీ చేసింది. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఈ బదిలీ అయిన 1500 మంది ఉపాధ్యాయులకు ఈ నాటికీ జీతాలు ఇవ్వలేదు. 262 ప్రాథమిక పాఠశాలల్లోని మూడు, నాలుగు, ఐదు తరగతులను ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడంతో ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య తగ్గింది. తగ్గిన విద్యార్థులను ప్రామాణికంగా తీసుకుంటే మిగులు ఉపాధ్యాయులను తేల్చవచ్చని భావించిన ప్రభుత్వం వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌ను చేపట్టింది. ఆ పేరుతో చేసిన సర్దుబాట్లతో ఉమ్మడి జిల్లాలో సుమారు 431 ఎస్‌జిటిలను మిగులుగా విద్యాశాఖ గుర్తించింది. ఇంకొంతమంది మిగులు సబ్జెక్టు టీచర్లున్నట్లు తేల్చింది.

ఉపాధ్యాయుల సర్దుబాటు పేర మిగులు ఉపాధ్యాయులను తేల్చాలన్న మిగతా 2లో..

# విద్యారంగ సమస్యలపై ఎస్‌ఎఫ్‌ఐ సైకిల్ యాత్ర

## భీమిలి నుంచి ప్రారంభం - విద్యార్థుల సమస్యలు తెలుసుకున్న నాయకులు

ప్రజాశక్తి - భీమునిపట్నం

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలంటూ ఎస్‌ఎఫ్‌ఐ విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యాన తలపెట్టిన 'విద్యార్థి సంఘర్షణ సైకిల్ యాత్ర' శనివారం భీమునిపట్నంలో ప్రారంభమైంది. గాజువాక వరకూ సాగే ఈ సైకిల్ యాత్రలో హాస్టళ్లు, ప్రభుత్వ విద్యాలయాల్లోని సమస్యలను తెలుసుకోనున్నారు. యాత్ర తొలిరోజు భీమిలిలోని ఎస్‌సి, బిసి సమీకృత బాలురు, బాలికల కళాశాల హాస్టళ్లను, ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలను సంఘం నాయకులు సందర్శించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి ఎల్‌జె.నాయుడు మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలే మార్గమని విద్యార్థులకు పిలుపునిచ్చారు. సొంత భవనాలు లేని చోట ప్రభుత్వం సంక్షేమ మిగతా 2లో..

భీమిలిలో ఉత్సాహంగా సాగుతున్న ఎస్‌ఎఫ్‌ఐ సైకిల్ యాత్ర

వార్తలు 6లో..

విశాఖ డిఇఒ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

# సమస్యలపై ఫ్యాప్టో ఆందోళనలు

HRIDHAY™
HEART CENTER
హృదయ్ హార్ట్ సెంటర్ ఆగస్టు 22న
1వ వార్షికోత్సవం సందర్భంగా హృదయ్ డయాగ్నోస్టిక్‌లో
50% డిస్కౌంట్‌తో రక్తపరీక్షలు చేయబడును.

Dr K.Narayana Raju
MD, DNB (Cardio)
Consultant Interventional Cardiologist
Beside Eaters Stop Restaurant, Opp. Chinagantyada Bus Stop,
Gajuwaka, Visakhapatnam. Cell : 91 85999 56999

మొదటి పేజీ తరువాయి..

## 'సర్దుబాట్లు'.. విద్యార్థులకు పాట్లు

కుట్ర తప్ప విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను ఏర్పాటు చేయాలన్న సత్సంకల్పం ప్రభుత్వంలో ఏ కోశానా కన్పించడం లేదు. విద్యా శాఖ నిబంధనల ప్రకారం ఆగస్టు 31 వరకు విద్యార్థుల ప్రవేశాలకు గడువు వుంది. ఈ గడువు పూర్తయ్యాక అప్పటి విద్యార్థుల ప్రకారం ఉపాధ్యాయులను సర్దుబాటుచేస్తే, కొంతైనా చెప్పుకోవడానికి సహేతకత వుండేది. బదిలీ చేసిన మూడు నెలల వ్యవధిలో మళ్లీ సర్దుబాటు అంటే ఉపాధ్యాయులు తీవ్రమైన మానసిక ఆందోళనకు గురికావడమే కాదు, విద్యా సంవత్సరం మధ్యలో ఉపాధ్యాయులు వెళ్లిపోతే విద్యార్థులకు పాఠ్యాంశాల బోధన సమస్య ఏర్పడుతుంది. ఈ మాత్రం దూరదృష్టి ప్రభుత్వానికి లేకకాదు. పేద పిల్లలు చదువులెలాపోయినా విద్యపై పెడుతున్న ఖర్చును తగ్గించుకొని ప్రయివేటు విద్యను ప్రోత్సహించాలన్న దురుద్దేశం ప్రభుత్వాధినేతల మనసునిండావుంది. అందుకనే... విద్యార్థుల ప్రవేశాల గడువుకు నెలముందున్న విద్యార్థుల సంఖ్యను తీసుకొని ఉపాధ్యాయుల సర్దుబాటు చేసింది. ఉపాధ్యాయులను తగ్గించాలన్న కుట్రలో భాగంగా ఆగస్టు 1 నుంచి 31 వరకు ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థులను పరిగణనలోకి తీసుకోవడంలేదు. విద్యా ప్రమాణాలు దిగజార్చేలా ప్రభుత్వ నిర్ణయాలుండడంతో సర్దుబాటు నిర్ణయాన్ని వెనక్కు తీసుకొని, ఉపాధ్యాయుల జీతాలు చెల్లించాలని ఫ్యాప్టో ఆధ్వర్యంలో శనివారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు ఆందోళన అనివార్యమైంది.

## విద్యారంగ సమస్యలపై ఎస్ఎఫ్ఐ సైకిల్ యాత్ర

హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని, పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలను రూ.3 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టళ్లకు సన్న బియ్యం సరఫరా చేయాలని, మరమ్మతుకు గురైన హాస్టళ్ల భవనాలకు నాడు - నేడు నిధులతో మరమ్మతులు చేపట్టాలని కోరారు. పీజీ విద్యార్థులకు విద్యా దీవెన అమలు చేయాలని, ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణకు చట్టం తీసుకు రావాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల పేదలకు ఉన్నత విద్య అందని ద్రాక్షగా మారిందని అన్నారు. నూతన జాతీయ విద్యా విధానం వల్ల సామాన్యులు విద్యకు దూరమవుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి పి.రామ్మోహనరావు, విశాఖ జిల్లా గర్ల్స్ కన్వీనర్ జి.పల్లవి, శశి కుమార్, గుణశేఖర్, కౌశిక్, సూర్య, దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు. ఈ యాత్రకు సిఐటియు భీమిలి జోన్ అధ్యక్షులు ఆర్ఎస్ఎన్.మూర్తి సంఘీభావం తెలిపారు

మాట్లాడుతున్న డాక్టర్ వావా

## సఫాయి కార్మికులు గౌరవంగా జీవించేలా చర్యలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎంఎస్ యాక్ట్ - 2013 అమలు చేయాలని, సఫాయి కర్మచారుల సామాజిక, ఆర్థిక, విద్యా స్థితిగతులను అధ్యయనం చేసి వారు సమాజంలో గౌరవంగా జీవించే అవకాశం కల్పించాలని నేషనల్ కమిషన్ ఫర్ సఫాయి కర్మచారి గౌరవ సభ్యులు డాక్టర్ పిపి.వావా అన్నారు. ఆయన శనివారం విశాఖలో పర్యటించారు. అనంతరం జివిఎంసి సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం మాన్యువల్ స్కావెంజింగ్‌ను అంతం చేయగలదని తెలిపారు. అంతేగాకుండా మురుగునీటి కార్మికుల ప్రాణాలను కాపాడుతుందన్నారు. ఎంఎస్ యాక్ట్ 2013లో ఇచ్చిన ఆదేశాలను అమలు చేయడంలో కమిషన్ గట్టి ప్రయత్నం చేస్తోందని తెలిపారు. రాష్ట్రాలు, మున్సిపాలిటీలు, ఓడరేవుల అధికారులు, వివిధ సంఘాలు, జిల్లా అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపారు. పునరావాస చట్టం 2013 డిసెంబర్ 6 నుంచి అమల్లోకి తేవడంతో మనుషులంతా ఒక్కటే అనే భావన పెరిగిందని, మాన్యువల్ స్కావెంజర్ల పునరావాసం, ప్రత్యామ్నాయాన్ని కూడా చట్టం అందిస్తుందని అన్నారు. నిర్ణీత గడువులోగా వారికి ఉపాధి అవకాశాలు కల్పించడమే కాకుండా వారికీ విద్య, వైద్య ఆరోగ్య రంగాలలో సహకారం అందించాలని తెలిపారు. పారిశుధ్య కార్మికులకు పునరావాసం కల్పించడమే కాకుండా గౌరవప్రదమైన జీవితాన్ని గడిపేందుకు ప్రత్యామ్నాయ వృత్తుల్లో మాన్యువల్ స్కావెంజర్స్‌కు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. అత్యంత ప్రమాదకరమైన మురుగు కాలువలు, సెప్టిక్ ట్యాంకుల్లో మాన్యువల్ క్లీనింగ్‌ను నిలిపివేసి, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలని, దానికి సంబంధించిన విషయాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఆ విధంగా చర్యలు చేపడుతున్న జిల్లా యంత్రాగాన్ని అయన ప్రశంసించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మ, డిసిపి విద్యాసాగర్ నాయుడు, జిల్లా అధికారులు, కార్మిక సంఘాల నాయకులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

వినియోగదారుల కమిషన్ నుంచి..

# ప్రతివాదులకు నేరుగా నోటీసులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వినియోగదారుల కమిషన్ నుంచి ప్రతివాదులకు. నేరుగా నోటీసులు అందేలా చర్యలు చేపడుతున్నట్టు మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎస్.శ్రీదేవి తెలిపారు. శనివారం విశాఖ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కన్జ్యూమర్ అధికారులు, వినియోగదారుల ఫోరం ప్రతినిధులు, న్యాయవాదులతో వినియోగదారుల అవగాహన సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ కమిషన్ నుంచి నోటీసు వెళ్లినా, సరిగా చేరకపోవడం, చేరినా.. ప్రతివాదులు సరిగా స్పందించకపోవడం వంటివి జరుగుతున్నాయన్నారు. ఆ సమస్యను దృష్టిలో పెట్టుకొని ప్రతివాదులకు సక్రమంగా నోటీసులు అందేలా పోలీస్ శాఖ నుంచి ఓ అధికారిని నియమిస్తున్నట్టు ఆమె తెలిపారు. నోటీసులు అందినా, స్పందించకపోతే ప్రతివాదులపై చర్యలు తీసుకునేలా ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. వినియోగదారుల కమిషన్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఫోరం సభ్యులందరిపైనా ఉందన్నారు. ముఖ్యంగా న్యాయవాదులు దీనిపై వినియోగదారులను చైతన్యం కలిగించే కృషి చేయాలని సూచించారు. సమావేశంలో డిసిడిఆర్ సి-1 అధ్యక్షురాలు జి.తనూజ, సమావేశం కన్వీనర్ జి.వెంకటేశ్వరి, ఫోరం సభ్యులు పి.విజయదుర్గ, డాక్టర్ కె.రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న జడ్జి శ్రీదేవి

### బ్రోచర్ ఆవిష్కరణ

వినియోగదారుల చట్టం ద్వారా సత్వర న్యాయం జరుగుతుందని జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ (డిసిడిఆర్) - 1 అధ్యక్షురాలు జి.తనూజ అన్నారు. కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో శనివారం 'మేలుకో... హక్కులు తెలుసుకో, అందరి చుట్టం.. వినియోగదారుల రక్షణ చట్టం' పేరుతో కన్స్యూమర్ ఆర్గనైజేషన్స్ ఫెడరేషన్ రూపొందించిన బ్రోచర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వినియోగదారులు రక్షణ చట్టంపై కరపత్రాలు, పుస్తక ప్రచురణల ద్వారా వినియోగదారుల సంఘాలు విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. మోసాలపై అప్రమత్తంగా ఉండటానికి ప్రజలకు సమాచారం అందజేయడం, విషయ పరిజ్ఞానం కల్పించడం ధ్యేయంగా స్వచ్ఛంద సంస్థలు పని చేయాలన్నారు. కార్యక్రమంలో కన్స్యూమర్ ఆర్గనైజేషన్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కాండ్రేగుల వెంకటరమణ, డిసిడిఆర్ -2 అధ్యక్షురాలు జి.వెంకటేశ్వరి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి జి.సూర్యప్రకాశరావు, వినియోగదారుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఉత్సాహంగా ఎపిఎల్ మ్యాచ్‌లు

రాయలసీమ కింగ్స్, ఉత్తరాంధ్ర లయన్స్ జట్లు విజయం

ప్రజాశక్తి - పిఎం.పాలెం : స్థానిక ఎసిఎ - విడిసిఎ క్రికెట్ స్టేడియంలో ఆంధ్రా ప్రీమియర్ లీగ్ (ఎపిఎల్) సీజన్ - 2 మ్యాచ్‌లు ఉత్సాహంగా సాగుతున్నాయి. శనివారం జరిగిన తొలి మ్యాచ్‌లో బెజవాడ టైగర్స్‌పై రాయలసీమ కింగ్స్ విజయఢంకా మోగించింది. తొలుత టాస్ గెలిచిన రాయలసీమ కింగ్స్ జట్టు బౌలింగ్ ఎంచుకుంది. బెజవాడ టైగర్స్ బ్యాట్స్‌మ్యాన్లు 20 ఓవర్లలో 5 వికెట్లు నష్టానికి 152 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రాయలసీమ కింగ్స్ క్రీడాకారులు 19 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి విజయలక్ష్యాన్ని చేరుకున్నారు. ఓపెనర్‌గా దిగిన కెఎం.వీరారెడ్డి 39 బంతుల్లో 4 సిక్స్‌లు, 5 ఫోర్లుతో 61 పరుగులు సాధించి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. ఇక రెండో మ్యాచ్‌లో ఉత్తరాంధ్ర లయన్స్ జట్టు బోణీ కొట్టింది. కోస్టల్ రైడర్స్ జట్టుపై విజయం సాధించి అభిమానుల్లో ఆనందం నింపింది. తొలుత టాస్ గెలుచుకున్న కోస్టల్ రైడర్స్ బ్యాటింగ్ ఎంచుకుని 20 ఓవర్లలో 7 వికెట్లు నష్టానికి 160 పరుగులు సాధించింది. ఎం.హర్షవర్ధన్ 37 బంతుల్లో 2 సిక్స్‌లు, మూడు ఫోర్లుతో 44 పరుగులు చేశాడు. జి చిరంజీవి 23 బంతుల్లో 2 సిక్స్‌లు, 3 ఫోర్లుతో 38 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఉత్తరాంధ్ర లయన్స్ క్రీడాకారులు 161 పరుగులు టార్గెట్‌ను 17.3 ఓవర్లలో 7 వికెట్లు నష్టపోయి ఛేదించారు. ఓపెనర్లుగా దిగిన కెఎస్.భరత్ 22 బంతుల్లో 4 సిక్స్‌లు, 6 ఫోర్లుతో 54 పరుగులు చేసి రాణించాడు. ఆయన్ని మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ వరించింది.

## నేడు ఇతిహాస్ కే పన్నోంసే టికెట్ షో

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఇతిహాస్ కే పన్నోంసే (చరిత్ర పుటల్లోంచి) శీర్షికన భారత స్వతంత్ర సంగ్రామంలో వీరోచితంగా పోరాడి అసువులుబాసిన యోధానుయోధులను కళ్లకు కట్టినట్టు చూపెట్టే కార్యక్రమం ఆదివారం సాయంత్రం 5:30 గంటలకు అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో జరుగనుంది. 77వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ముంబయికి చెందిన హెరిటేజ్ స్టోరీస్ అండ్ పర్‌ఫార్మింగ్ ఆర్ట్స్ (హెచ్ఎస్‌పిఎ) సంస్థ అరుదైన ఈ సంగీత, నృత్య, కథా కారర్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. విశేష నైపుణ్యాలున్న కళాకారుల అరుదైన ప్రదర్శన ఇదని నిర్వాహకులు శనివారం వెల్లడించారు.

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
In the matter of Succession Certificate for the debts payable to the Estate of Late Mudadla Sudharani
**S.O.P.21/2023**
**Between:**
Mudadla Jaya Lakshmi,
W/o. late M. Rami Naidu ...Petitioner
**And:**
Nil ...Respondents
**GENREAL NOTICE**
Whereas the petitioner filed the above Succession Original petition for grant of a Certificate in respect of all the monies lying in State Bank of India, Mutual Funds mentioned hereunder:
**SCHEDULE**
All the monies lying in State Bank of India, Mutual Funds vide SBI Longterm EQ (DP) Folio No. 12529402 and another vide SBI Longterm EQ (G) Folio No. 12529402 to a tune of Rs.18,55,571-28Ps.
The said SOP stands posted to **28-08-2023 at 10:30 A.M.** The public is hereby called upon to appear before the above court by **10:30 a.m.** on **28th August 2023** either in person or through an Advocate in order to answer the petition by submitting objections if any by anyone or else it will be construed that there are no objections, and the matter will be decided in favor of the above-named petitioner as prayed for.
(By Order of the Hon'ble Court)
**R. DURGA PRASAD NAIDU**
Advocate, Visakhapatnam.

IN THE HON'BLE COURT OF THE II ADDL. JUNIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
**O.S.162/2022**
**Between:**
**Pilla Appa Rao** ...Plaintiff
**And:**
**Simhadri Mani Kumar** ...Defendant
**SUMMONS**
To, **The Defendant:**
**Simhadri Mani Kumar,**
S/o. Varaha Chari,
# Qtr.No.E Type-20,
Staff Colony, Gandhigram,
Schindia, Hindustan Shipyard,
Visakhapatnam-530005.
Please take notice that the above named plaintiff has instituted the above suit against you and the matter stands posted to **06-09-2023** for your appearance. You are hereby summoned to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **06-09-2023** at **10:30 A.M** in the above Court to answer all material questions, failing which the matter will be heard and determined in your absence, exparte as per law.
(By Order of the Hon'ble Court)
**D. ROJA SUNANDA**
**G. SATYANARAYANA,**
Advocates, Visakhapatnam

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT: GAJUWAKA
**O.S.388/2022**
**Between:**
**Sri Bade Narasimha Sekhar**
& another ...Plaintiffs
**And:**
M/s.Sandilya General Industries (Vizag) & M/s. Nandini Cranes (P) Ltd., Rep. by its Prop:
Sri Shashi Sandilya & 5 others ...Defendants
**SUMMONS**
To,
**D-1: M/s. Sandilya General Industries (Vizag) & M/s. Nandini Cranes (P) Ltd.,**
Rep. by its Prop: Sri Shashi Sandilya,
S/o. K.V.S. Sandilya,
Plot No. Special D-4, APICL
(Andhra Pradesh Infrastructure Corporation Limited) Visakhapatnam,
B-Block, Industrial Development Area, Visakhapatnam-12.
**D-2: Sri Shashi Sandilya,**
S/o. K.V.S. Sandilya, Hindu,
aged 76 years, Rest-do-
Please take notice that the above named plaintiffs has instituted the above suit against you and the matter stands posted to **04-09-2023** for your appearance. You are hereby summoned to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **04-09-2023** at **10:30 A.M** in the above Court to answer all material questions, failing which the matter will be heard and determined in your absence, exparte as per law.
**A. TULASI RAMESH**
**CH. VENKATESWARA RAO**
**& CH. V.S.N. MURTHY**
Advocates, Visakhapatnam.

# వినియోగంలోకి కల్యాణమండపం!

ఆనందపురం కళ్యాణమండపం

ప్రజాశక్తి-ఆనందపురం: ఆనందపురంలో రంగనాథస్వామి దేవస్థానానికి చెందిన స్థలంలో ప్రభుత్వ నిధులతో నిర్మించిన కల్యాణ మండపం నిర్వహణ వ్యవహారానికి తెరపడింది. కల్యాణ మండపం ఉన్న స్థలం దేవదాయ శాఖకు చెందినది కావడంతో ప్రభుత్వ నిధులతో నిర్మించిన ఆ భవనాన్ని దేవాదాయ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీంతో దాని నిర్వహణ పంచాయతీ చేపట్టడానికి అవకాశం లేక ఆరేళ్లుగా కల్యాణ మండపంలో ఎటువంటి కార్యకలాపాలూ నిర్వహించలేదు. దీంతో మండపం నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుకుంది. ఈ నేపథ్యంలో గుడిలోవ దేవస్థానం ఇఒ సిరికి నానాజీ ఆధ్వర్యాన మూడేళ్ళ పాటు అద్దె ప్రాతిపదికన కల్యాణ మండపం నిర్వహణకు వేలం పాట నిర్వహించారు. ఈ మేరకు ఏడాదికి రూ. 10 వేల చెల్లించడానికి ముందుకొచ్చిన మీసాల నాయుడుకు పాట ఖరారు చేశారు. శుక్రవారం సాయంత్రం నిర్వహించిన వేలంలో దేవస్థానం ఈవో నానాజీ బాబు, అధికారి పిఎస్ఎన్.మూర్తి, దేవస్థానం చైర్మన్ గిరిరాజ, జూనియర్ అసిస్టెంట్ ఈశ్వరరావు, మాజీ చైర్మన్ రెడ్డి బాబు, నాయకులు శనగం చినరామారావు, పేదరామారావు, చందక స్వామి, మీసాల నాయుడు శ్రీనాథ్ నారాయణరావు పాల్గొన్నారు.

కల్యాణ మండపం పూర్తిగా పాడై ప్రస్తుతం ఎటువంటి కార్యకలాపాలు నిర్వహించడానికి వీలు లేకుండా ఉంది. సొంత నిధులతో అభివృద్ధి చేసి, సౌకర్యాలు కల్పించడానికి పాటదారుడు మీసాల నాయుడు ముందుకు రావడంతో దేవదాయ శాఖ అధికారులు అంగీకారం తెలిపారు. కల్యాణ మండపం చుట్టూ ప్రహరీ, భవనం పైన రేకుల షెడ్డు, భవనం మొత్తం మరమ్మతులు చేయడానికి నిర్ణయించారు. దేవదాయ శాఖ నిబంధనలకు లోబడే పనులు చేపట్టాలని, అందుకు సంబంధించి ఆ శాఖ ఎటువంటి పెట్టుబడి పెట్టదని అధికారులు స్పష్టం చేశారు. పాట కాలపరిమితి ముగిసిన మూడేళ్ల అనంతరం కల్యాణ మండపాన్ని దేవదాయ శాఖకు పాటదారుడు తిరిగి అప్పగించడానికి నిర్ణయించారు. దీంతో చాలా కాలం తర్వాత ఈ మండపం వినియోగంలోకి రానున్నుండడంతో స్థానికులకు ఉపయోగకరంగా మారనుంది.

బిఎంటి యూనిట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి విడదల రజని

## అపోలోలో బోన్ మారో ట్రాన్స్‌ప్లాంట్ యూనిట్ ప్రారంభం

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆరిలోవ హెల్త్‌సిటీలోని అపోలో కేన్సర్ సెంటర్‌లో అత్యాధునిక బోన్ మారో ట్రాన్స్ ప్లాంట్ (బిఎంటి) యూనిట్‌ను ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని శనివారం ప్రారంభించారు. అనంతరం ఆమె జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జునతో కలిసి బిఎంటి యూనిట్‌ను స్వయంగా పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఖరీదైన బోన్ మారో ట్రాన్స్‌ప్లాంట్ చికిత్సను ఆరోగ్యశ్రీ ద్వారా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. ఇప్పటికే ఆరోగ్యశ్రీ పరిధిలోకి 3,257 వ్యాధులను తీసుకొచ్చినట్టు తెలిపారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఈ ఏడాది రూ.3,400 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలో 17 కొత్త గవర్నమెంట్ మెడికల్ కాలేజీలకు రూ.8,500 కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. ఈ ఏడాది ఐదు ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 750 సీట్లు అందుబాటులో వస్తున్నాయన్నారు.

అపోలో కేన్సర్ సెంటర్ మెడికల్ ఆంకాలజిస్టు డాక్టర్ రాకేష్ రెడ్డి మాట్లాడుతూ, బోన్ మారో ట్రాన్స్‌ప్లాంట్ ప్రక్రియ అత్యంత కీలకమైందన్నారు. ఈ కార్యక్రమంలో అపోలో రీజనల్ సిఇఒ సుబ్రహ్మణ్యం, వైజాగ్ అపోలో సిఇఒ రామచంద్ర, డాక్టర్ రవిరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. మోషన్ స్కూల్ హెల్త్ ఐ కేర్ ప్రాజెక్ట్, పెద వాల్తేర్ హాస్పిటల్ ట్రస్ట్ సహకారంతో చిట్టివలస శ్రీ సత్య సాయి సేవా సంస్థలు ఆధ్వర్యాన విద్యార్థులకు ఉచిత నేత్ర వైద్య పరీక్షలు జరిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పొట్నూరు మురళీమోహనరావు, సత్య సాయి సేవా సమితి జోనల్ కో-ఆర్డినేటర్ ఎవి.సత్యసాయికుమార్, టివిఆర్ బాబా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జూ పార్కుకు ఆడ సింహం రాక

ప్రజాశక్తి - ఆరిలోవ : జంతు మార్పిడి విధానంలో భాగంగా గుజరాత్‌లో గల నక్కర్‌బాగ్ జులాజికల్ గార్డెన్ నుంచి వైజాగ్ ఇందిరాగాంధీ జంతు ప్రదర్శన శాలకు రెండున్నర సంవత్సరాల ఆడ సింహాన్ని తీసుకొచ్చారు. నక్కర్‌బాగ్ జంతు ప్రదర్శన శాల వెటర్నరీ వైద్యుడు ప్రశాంత్ మారు, వైజాగ్ జూ వైద్యుడు డాక్టర్ ఫణీంద్ర, జూనియర్ వెటర్నరీ డాక్టర్ పురుషోత్తం, సిబ్బంది సంరక్షణలో గుజరాత్ నక్కర్‌బాగ్ జూ పార్కు నుంచి శుక్రవారం అర్ధరాత్రి వైజాగ్ జూ పార్కుకు ప్రత్యేక వాహనంలో తీసుకొచ్చారు. వైజాగ్ జూ పార్కు నుంచి ఒక మగ, ఒక ఆడ అడవి కుక్కలను తీసుకెళ్ళున్నారు. కొత్తగా వచ్చిన ఆడ సింహం సందర్శకులకు ప్రత్యేక ఆకర్షణగా ఉంటుందని జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా తెలిపారు. ఇప్పటికే జూ పార్కులో ఉన్న ఒక జత సింహాలతో పాటు సింహాల గుంపును ఏర్పరచడంలో సహాయ పడుతుందన్నారు. కొత్తగా వచ్చిన ఆడ సింహాన్ని ప్రోటో కాల్ నిబంధనల ప్రకారం కొన్ని రోజుల పాటు క్వారంటైన్‌లో ఉంచుతామన్నారు.

జూ పార్కుకు తీసుకొచ్చిన ఆడ సింహం

# భీమిలి టౌన్‌లో రోడ్ల విస్తరణపై ప్రత్యేక దృష్టి

భీమిలి ప్రధాన రహదారిలో జివిఎంసి కమిషనర్ సిఎం సాయికాంత్‌వర్మ పర్యటన

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక మెయిన్ రోడ్డు, ఇతరత్రా రోడ్ల విస్తరణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు జివిఎంసి కమిషనర్ సిఎం సాయికాంత్ వర్మ తెలిపారు. స్థానిక మెయిన్ రోడ్డు, గంట స్తంభం, బీచ్ రోడ్డు, తగరపువలస రోడ్డును శనివారం ఆయన పరిశీలించారు. భీమిలి ప్రధాన రహదారి ఇరుకుగా ఉండడాన్ని గుర్తించిన ఆయన, సంబంధిత రోడ్డు విస్తరణకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను ఆదేశించారు. కనీసం 40 నుంచి 60 అడుగుల మేర రోడ్డు విస్తరణకు గల అవకాశాలను పరిశీలించాలని సూచించారు. స్థానిక మార్కెట్‌ను ఆధునికీకరించాల్సిన ఆవశ్యకతను వివరించారు. పరిసరాల్లో పలు చోట్ల వ్యర్థాలు, చెత్త పోగులు కనిపించడంతో పారిశుధ్యంపై అలసత్వం ప్రదర్శించకుండా ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.మహాలక్ష్మినాయుడును ఆదేశించారు. పారిశుధ్యం, మురుగుదొడ్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని, మురుగు కాల్వలను ప్రతి రోజూ శుభ్ర పరచాలని, ఫాగింగ్, స్ప్రేయింగ్ చేయాలని ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, పర్యవేక్షక ఇంజినీర్ శ్యాంసన్ రాజు, పట్టణ ప్రణాళిక విభాగం ఎసిపి శ్రీనివాస్, స్మార్ట్ సిటీ కార్యనిర్వాహక ఇంజినీర్ సుధాకర్, వివిధ శాఖల అధికారులు, వైసిపి నియోజక వర్గ ఇంఛార్జి ముత్తంశెట్టి మహేష్, మూడో వార్డు ఇంఛార్జి మైలపల్లి షణ్ముఖరావు, వార్డు అధ్యక్షులు అల్లిపిల్లి నరసింగరావు, మాజీ కౌన్సిలర్ మైలపల్లి లక్ష్మణరావు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

# మేధో సంపత్తిని వెలికితీసేందుకు సైన్స్ ఫెస్ట్

**ఎన్ఎస్‌టిఎల్ అడిషనల్ డైరెక్టర్ కాశీ విశ్వేశ్వరరావు**

ప్రజాశక్తి-ఆనందపురం : విద్యార్థుల్లో ఉన్న మేధోసంపత్తిని వెలికితీయడానికి సైన్స్ ఫెస్టులు దోహదపడతాయని ఎన్ఎస్‌టిఎల్ అడిషనల్ డైరెక్టర్ కాశీ విశ్వేశ్వరరావు పేర్కొన్నారు. ఆనందపురం మండలం వెల్లంకి సమీపంలోని రవీంద్రభారతి గ్లోబల్ పాఠశాలలో శనివారం కాస్మస్ సైన్సుఫెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాశీ విశ్వేశ్వరరావు హాజరై విద్యార్థులు తయారు చేసిన నీటిని శుద్ధి చేసే విధానం, సీడింగ్, మార్స్, జిపిఎస్ స్పేస్ డిబ్రిస్, క్లౌడ్ సోలార్ పాయినర్ ఇరిగేషన్ సిస్టమ్, చంద్రయాన్ - 3, జియో బోర్డు కాన్‌స్టెలేషన్ తదితర ప్రాజెక్టులను పరిశీలించారు. అనంతరం ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ, పాఠశాల విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను, తెలివితేటలను మెచ్చుకున్నారు. పాఠశాల స్థాయి నుంచే సైన్సుపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. అబ్దుల్ కలాం లాంటి ఎంతోమంది మేధావుల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జోన్ ఇన్‌ఛార్జి వెంకటేశ్వరరావు, ప్రధాన జనరల్ మేనేజర్ వసంత, జనరల్ మేనేజర్ రమ్య, డిఎం లలిత, సహాయక జనరల్ మేనేజర్లు ఉమామహేశ్వరరావు, రమణ, ప్రిన్సిపల్ మంగలక్ష్మి, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నమూనాలను పరిశీలిస్తున్న ఎన్ఎస్‌టిఎల్ అధికారి కాశీ విశ్వేశ్వరరావు, ఉపాధ్యాయులు

మృతురాలి కుటుంబీకులను పరామర్శిస్తున్న చిరంజీవిరావు

## మృతురాలి కుటుంబానికి ఎమ్మెల్సీ పరామర్శ

ప్రజాశక్తి -తగరపువలస : ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన చిట్టివలస కొత్తపేటకు చెందిన చెలికాని వెంకట సంధ్యారమణి కుటుంబాన్ని ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసనమండలి సభ్యులు వేపాడ చిరంజీవిరావు శనివారం పరామర్శించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పరామర్శించిన వారిలో భీమిలి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు, నాయకులు పిట్ట సురేష్, టి.సూరిబాబు, జగన్నాథ గణేష్, చిలకా నరసింగరావు, గిడుతూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## అనంతవరంలో అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని అనంతవరం గ్రామ పంచాయతీలో రూ.48 లక్షలతో అభివృద్ధి చేసిన పనులను శనివారం ప్రారంభించామని ఎంపిపి రాంబాబు తెలిపారు. అనంతవరం ప్రధాన వీధిలో రూ.22 లక్షలతో ఏర్పాటుచేసిన నాలుగు బోర్లు, ఇంటింటి కుళాయిలను ముందుగా ప్రారంభించారు. అనంతరం రూ.6 లక్షలతో నిర్మించిన ముస్లిముల శ్మశానవాటికను, మధురగ్రామం గొల్లలపాలెంలో రూ.లక్షతో ఏర్పాటుచేసిన బోరును, అనంతవరం ప్రధాన వీధికి ఇరువైపులా రూ.19 లక్షలతో నిర్మించిన డ్రెయినేజీని ప్రారంభించారు. ఈ పనులన్నీ స్థానిక ఎమ్మెల్యే చొరవతో చేయగలిగామని ఎంపిపి రాంబాబు, జడ్‌పిటిసి గిరిబాబు తెలిపారు. ఈ కార్యక్రమంల్లో ఉప సర్పంచ్ సత్యనారాయణ, ఎంపిటిసి మాజీ సభ్యులు చంద్రరావు, నాయకులు రవి, గోవింద, శివ, రామకృష్ణ పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభంలో ఎంపిపి రాంబాబు

హెచ్‌పి గ్యాస్ మేళాలో పాల్గొన్న ప్రతినిధులు

## కూర్మన్నపాలెంలో హెచ్‌పి గ్యాస్ మేళా

**ప్రజాశక్తి-ఉక్కునగరం :** విజయ్ దుర్గ గ్యాస్ ఏజెన్సీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలోని సామాజిక భవనంలో గ్యాస్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, సరసమైన ధరలకే కొత్తగా కనెక్షన్ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా వినియోగదారులకు సేఫ్టీ క్లినిక్ క్యాంప్ నిర్వహించారు. గ్యాస్‌స్టవ్ పరికరాలను వినియోగించేటప్పుడు పాటించాల్సిన భద్రతా చర్యలపై అవగాహన కల్పించారు. తమ వద్ద కనెక్షన్ తీసుకున్న వినియోగదారులకు ఐదేళ్లకోసారి భద్రతా తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. పాత స్టవ్‌లను మార్చుకునే అవకాశం ఉందని, లబ్ధిదారులు రెండవ సిలిండర్‌ను పొందవచ్చని పేర్కొన్నారు. 5 కిలోల మినీ సిలిండర్లు కూడా లభిస్తాయన్నారు.

ఆనందకుమార్‌ను సత్కరిస్తున్న యాదవ సంఘం సభ్యులు

## విజ్ఞానమండలి యాదవ సంఘం సభ్యులకు అభినందనలు

**ప్రజాశక్తి -ములగాడ :** జివిఎంసి 61వ వార్డు పరిధి మల్కాపురం యాదవవీధికి చెందిన శ్రీ విజ్ఞానమండలి యాదవ సంఘం నూతన పాలకవర్గ సభ్యులను పశ్చిమ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అభినందించారు. ఆనంద్‌కుమార్ క్యాంప్ కార్యాలయంలో శనివారం సాయంత్రం యాదవ సంఘం గౌరవాధ్యక్షులు పురుకుటి రాజు, అధ్యక్షులు నూనెల నాయుడు, కార్యదర్శి చట్టి శివకుమార్, కోశాధికారి ఊరుకోటి యశ్వంత్, నూనెల ప్రసాద్, గొంప శంకర్, పడగల పవన్ కల్యాణ్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ, సంఘం అభివృద్ధికి, సభ్యుల సంక్షేమానికి కృషిచేయాలని పాలకవర్గ సభ్యులకు సూచించారు. అనంతరం ఆనంద్‌కుమార్‌ను సంఘం ప్రతినిధులు సత్కరించి జ్ఞాపికను అందించారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**ప్రజాశక్తి-సీతమ్మధార :** జివిఎంసి 46వ వార్డు పరిధి కస్తూరినగర్, మధుసూదన్‌నగర్, సూరిబాబునగర్, సంతోష్ నగర్, సంజీవయ్య కాలనీ ప్రాంతాల్లో రూ.2. కోట్లు 85లక్షల 45వేలతో నిర్మించే ఎస్‌డబ్ల్యు డ్రెయిన్లు, రోడ్లు, కల్వర్టులు, రైలింగ్, సామాజిక భవనం, అంగన్‌వాడీ భవనం తదితర అభివృద్ధి పనులకు డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ ఆధ్వర్యాన మేయర్ గొలగాని హరివెంకటకుమారి, ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కెకె.రాజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అభివృద్ధితో పాటు సంక్షేమం, మౌలిక సదుపాయాల కల్పన దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, ఇక శ్రీనివాస్, డిఇ భరణి, ఎఇ ఉమామహేశ్వరరావు, 46వ వార్డు నాయకులు కె.చిన్నా, ఎస్.రామారావు, ఎన్.కృష్ణ, జి.అప్పారావు, లావణ్య, ఎంవి.రమణ, దూది నర్సింగరావు, కె.శ్రీను, దుర్గాభవానీ, అప్పలరెడ్డి, కె రామారావు, నారాయణరెడ్డి, యడ్ల అప్పారావు, దేవి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

## విఎస్ఆర్ ఆటో ఇ - మోటార్స్ షోరూమ్ ప్రారంభం

**ప్రజాశక్తి-సీతమ్మధార :** విశాఖ న్యూ కాలనీ పరిధిలోని శ్రీ కన్య థియేటర్ వద్ద విఎస్ఆర్ ఆటో ఇ - మోటార్స్ నూతన షోరూమ్‌ను మేయర్ గొలగాని హరివెంకటకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వ్యాపారరంగానికి విశాఖ అనుకూలమైనదని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి విశాఖ అభివృద్ధికి కృషిచేస్తున్నారని తెలిపారు. త్వరలోనే విశాఖ నగరం పరిపాలన రాజధానిగా అవతరించబోతుందన్నారు. ఆటో ఇ - మోటార్స్‌లో పర్యావరణానికి హాని ఉండదని, ఇటువంటి షోరూమ్‌లను ప్రతి నియోజకవర్గ పరిధిలోనూ ఏర్పాటుచేయాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో షోరూం నిర్వాహకులు సిహెచ్‌వి.రామిరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఫొటోగ్రఫీ డే

## ఉక్కునగరంలో ఫొటో ప్రదర్శన

**ప్రజాశక్తి-యంత్రాంగం**

**ఉక్కునగరం :** ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా స్టీల్‌ప్లాంట్ కార్పొరేట్ కమ్యూనికేషన్స్ విభాగం, వాల్తేర్ ఫొటోగ్రాఫిక్ సొసైటీ సంయుక్త నిర్వహణలో రెండు రోజుల ఫొటో ప్రదర్శనను ఉక్కునగరంలో నిర్వహించారు. శనివారం ప్రారంభ కార్యక్రమానికి స్టీల్‌ప్లాంట్ సిఎండి అతుల్ భట్ ముఖ్యఅతిథిగా హాజరై ఫొటో ప్రదర్శనలో ఉంచిన చిత్రాలను ఎంతో ఉత్సాహంతో తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, చిత్రాలు చరిత్రను చిరకాలం భద్ర పరుస్తాయన్నారు. రాబోయే తరాలకు చరిత్రను అందిస్తాయని పేర్కొన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారం నిర్మాణ, ప్రారంభ దశ నాటి చిత్రాలను ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. చక్కటి ఫొటో ప్రదర్శనను ఏర్పాటుచేసిన నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉక్కు చీఫ్ జనరల్ మేనేజర్ జి.గాంధీ, కార్పొరేట్ కమ్యూనికేషన్స్ విభాగాధిపతి ఆర్‌పి.శర్మ, వాల్తేరు ఫొటోగ్రాఫిక్ సొసైటీ అధ్యక్షులు పిఎన్.సేథ్, గౌరవాధ్యక్షులు వెంకటేశ్వరరావు, కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షులు జగపతిరాజు, కోశాధికారి వివి.రామరాజు, సహాయ కార్యదర్శి రమేష్‌చంద్రబోస్, ప్రతినిధులు సన్యాసిరావు, బిహెచ్.శ్రీనివాస్, డివి.రమణ, ప్రసాద్, బ్రహ్మాజీ, జిఎస్.మూర్తి, ఎం.కనకరాజు, వి.డెంటల్ హాస్పిటల్ జనరల్ మేనేజర్ రమేష్, డిఎవి స్కూల్ విద్యార్థులు, ఉక్కు ఉద్యోగులు పాల్గొన్నారు.

**చోడవరం :** అంతర్జాతీయ ఫొటో దినోత్సవం సందర్భంగా చోడవరం, మాడుగుల నియోజకవర్గాల ఫొటో అండ్ వీడియో గ్రాఫర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం చోడవరంలో కేక్ కట్ చేశారు. ప్రపంచ ఫొటో పితామహుడు లూయిస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు బొంగరాల సురేష్, రాజాన శివకుమార్, కార్యదర్శి స్వామి పట్నాయక్, సహాయ కార్యదర్శి టి సుధా, ట్రెజరర్ ఏ తులసీరావ్, సభ్యులు ప్రభాకర్, సతీష్, దుర్గారావు పాల్గొన్నారు.

ఉక్కునగరంలో ఫొటో ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థులు

# ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ క్యాంప్

వైద్య పరీక్షలు పొందుతున్న మహిళలు

**ప్రజాశక్తి -ములగాడ :** ధాన్ ఫౌండేషన్, మల్కాపురం కళంజియ సమాఖ్య ఆధ్వర్యాన శ్రీహరిపురంలోని సమాఖ్య కార్యాలయంలో మహాత్మాగాంధీ కేన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ సహకారంతో కేన్సర్ స్క్రీనింగ్ శిబిరం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, కేన్సర్‌ను తొలి దశలోనే గుర్తిస్తే పూర్తి నివారణ పొందవచ్చని తెలిపారు. ఆసుపత్రి డాక్టర్ ఎన్.భవాని మాట్లాడుతూ, 40 సంవత్సరాలు దాటిన ప్రతి స్త్రీ ఎప్పటికప్పుడు గైనిక్ సంబంధించిన పరీక్షలు చేయించుకోవాలని, బ్రెస్ట్‌లో గడ్డలకు సంబంధించిన స్వీయ పరీక్షలు చేసుకోవాలని, నెలసరిలో ఏవైనా మార్పులు, సమస్యలు గమనిస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలని సూచించారు. క్రమం తప్పకుండా వ్యాయామం, ఆహారంలో తగు పోషకాలు ఉండేలా చూసుకోవాలని చెప్పారు. ఈ క్యాంపులో 120 మందికి పైగా కళంజియం సభ్యులు తనిఖీలు చేయించుకోగా 4గురికి సమస్య ఉన్నట్లు తేలింది. వీరిని మహాత్మా గాంధీ ఆసుపత్రికి రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా బిజినెస్ మేనేజర్ శివరామకృష్ణ, వైజాగ్ రీజినల్ హెల్త్ కో-ఆర్డినేటర్ మురళీకృష్ణ, సమాఖ్య కో-ఆర్డినేటర్ సుభాషిణి, హెల్త్ అసోసియేట్ విజయ, సమాఖ్య సిబ్బంది, సమాఖ్య నాయకులు, క్లస్టర్ ఈసీ లీడర్లు, క్లస్టర్ బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

## భెల్‌లో ఐఎన్‌టియుసి, సిఐటియు ఫ్రంట్‌ను గెలిపించండి

**ప్రజాశక్తి -గాజువాక :** భెల్‌లో గుర్తింపు కార్మిక సంఘానికి ఈ నెల 31వ తేదీన జరిగే గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో ఐఎన్‌టియుసి, సిఐటియు ఫ్రంట్‌ను గెలిపించాలని నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం మెయిన్ గేటు వద్ద కార్మికులను కలిసి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శిగా పోటీలో ఉన్న వి.బాబూరావు మాట్లాడుతూ, కార్మిక హక్కుల పరిరక్షణ, గతంలో కోల్పోయిన హక్కుల సాధన కోసం తమ ఫ్రంట్‌ను గెలిపించాలని కోరారు. అధ్యక్షులుగా పోటీలో ఉన్న జిబిపి ప్రకాష్ మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితుల్లో , కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా పోరాటం చేస్తామని, స్థానిక యాజమాన్యంతో పోట్లాడి కార్మికులకు సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. ఈ ప్రచార కార్యక్రమంలో వి.ఆనందరావు, ఎస్.జగన్నాధరావు, ఎస్.రామారావు, పి.కనకరావు, చిట్టిబాబు, డి.నరసింహారావు, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

భెల్ మెయిన్ గేటు వద్ద ప్రచారం నిర్వహిస్తున్న ఐఎన్‌టియుసి, సిఐటియు నాయకులు

ఆసుపత్రికి తరలిస్తున్న స్థానికులు

## అమ్మను వదిలి వెళ్లిన కుమారుడు

**ప్రజాశక్తి- ఆనందపురం :** ఆనందపురం పూల మార్కెట్ వద్ద ఓ వృద్ధురాలిని కుమారుడు రోడ్డు పక్కన వదిలి వెళ్లిన ఘటన శనివారం చోటుచేసుకుంది. అబ్బుటివలస గ్రామానికి చెందిన రాంబాబు ద్విచక్ర వాహనంపై తీసుకొని వచ్చి ఆనందపురం పూల మార్కెట్ వద్ద దించి ఒక రొట్టె ఇచ్చి మరల వస్తానని చెప్పి వెళ్లిపోయాడని వృద్ధురాలు చెబుతోంది. అటుగా వెళ్లిన కొంతమంది స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడకు చేరుకొని వృద్ధురాలిని ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేర్చారు. పూర్తి వివరాలు చెప్పలేక పోతోంది. ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో ఆమెను కెజిహెచ్‌కు తరలిస్తున్నారు. వృద్ధురాలికి సంబంధించిన వారు స్థానిక పోలీసుస్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు సూచించారు.

## జన్మభూమి గొప్పది

**ప్రజాశక్తి-విశాఖపట్నం :** 'మేరీ మట్టి మేరా దేశ్' కార్యక్రమాన్ని శనివారం గీతం వైద్యవిద్యార్థులు ఘనంగా నిర్వహించారు. గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (జిమ్సర్) ఆవరణలో జరిగిన కార్యక్రమాలలో విద్యార్థులు సద్భావనా ర్యాలీతో పాటు పెద్దసంఖ్యలో మొక్కలు నాటారు. అనంతరం స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా జిమ్సర్ ప్రో -వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి మాట్లాడుతూ, జన్మభూమి అన్నింటికన్నా గొప్పదని, దేశంలో అట్టడుగు వర్గాల ప్రజల ఆరోగ్యం మెరుగుపడటానికి వైద్య నిపుణులు తమ వంతు కృషి చేసి రుణం తీర్చుకోవాలని పేర్కొన్నారు. ఆరోగ్య వంతమైన సమాజ నిర్మాణానికి చక్కటి పర్యావరణం తోడవ్వాలన్నారు. ఈ సందర్భంగా రక్త దానం, మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలలో పాల్గొన్న వైద్య విద్యార్థులను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో జిమ్సర్ వైద్యకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఐ.జ్యోతి పద్మజ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఆర్.రమణారావు తదితరులు పాల్గొన్నారు.

## పద్మశాలి వివాహ పరిచయ వేదికకు రిజిస్ట్రేషన్

**ప్రజాశక్తి-సీతమ్మధార :** జాతీయ స్థాయి పద్మశాలి వివాహ పరిచయ వేదికలో పాల్గొనేందుకు సెప్టెంబర్ 25వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సంఘం ప్రతినిధి బుందిడి కల్యాణి తెలిపారు. ఈ మేరకు పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## మినీ మ్యానిఫెస్టోను వివరించాలి

**ప్రజాశక్తి-గోపాలపట్నం :** తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు మినీ మేనిఫెస్టోలో ప్రవేశపెట్టిన మీ భవిష్యత్తు గ్యారెంటీ, మహాశక్తి పథకాలను ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు పిలుపునిచ్చారు. శనివారం నిర్వహించిన పశ్చిమ నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ, ఈ ప్రభుత్వంలో పెరిగిన వంట గ్యాస్, కరెంటు, నిత్యావసర ధరలతో ప్రజలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజల ఇబ్బందులను తెలుసుకున్న చంద్రబాబు రాష్ట్ర ప్రజల కోసం మేనిఫెస్టో రూపొందించారని తెలిపారు. ఈ పథకాల గురించి వివరిస్తూ రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు.

# ఉత్తరాంధ్ర సుజల స్రవంతిపై సదస్సు

సిపిఐ బస్‌యాత్రకు మద్దతు తెలిపిన అఖిలపక్ష నేతలు

**ప్రజాశక్తి -అనకాపల్లి :** 'రాష్ట్రాన్ని రక్షించండి, దేశాన్ని కాపాడండి' నినాదంతో సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బస్‌యాత్రలో భాగంగా శనివారం అనకాపల్లిలో సుజల స్రవంతి ప్రాజెక్టుపై సదస్సు జరిగింది. అఖిలపక్ష రాజకీయ నేతలు సంఘీభావం తెలిపారు. జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ అధ్యక్షతన జరిగిన సదస్సులో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ, జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలోని ఇరిగేషన్ ప్రాజెక్టులన్నీ మూలపడ్డాయన్నారు. 41.54 ఎత్తుగల పోలవరం ప్రాజెక్టు ను 41 మీటర్ల ఎత్తు తగ్గిస్తే ఉత్తరాంధ్ర సజల స్రవంతికి నీరు వచ్చే పరిస్థితి లేదన్నారు. అభివృద్ధి చేయకుండా, విధ్వంసంతో పాలన సాగిస్తున్నారని, రుషికొండ కొండను బోడిగుండును చేశారని ఆరోపించారు. అన్ని పార్టీలు నడుం బిగించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు.

సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ద్వారా సాగు, తాగునీరు అందిస్తేనే ఉత్తరాంధ్ర అభివృద్ధికి మార్గం సుగమమౌతుందన్నారు. 15 ఏళ్ల కిందట శంకుస్థాపన చేసిన ఈ ప్రాజెక్టును మూలన పడేసి, ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం హడావిడిగా తెరపైకి తేవడం ఉత్తరాంధ్ర ప్రజలను మోసగించడమే అవుతుందన్నారు. బడ్జెట్‌లో సరైన కేటాయింపులు లేకపోవడం వల్లే మూడేళ్లలో పూర్తి కావాల్సిన ఈ ప్రాజెక్టు 15ఏళ్లుగడిచినా ఇంకా మూలుగుతూనే ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తగిన నిధులు కేటాయించి సత్వరమే పూర్తి చేయాలన్నారు..

మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ రివర్స్ టెండరింగ్ పేరుతో సిఎం జగన పోలవరాన్ని నాశనం చేశాడన్నారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి. సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ మణిపూర్ హింసకాండపై రెండున్నర నెలల తర్వాత మోడీ స్పందించడం ఆయన వైఖరికి నిదర్శనమన్నారు. కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో జగన్ అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక, దివాలాకోరు ఆర్థిక విధానాలను ఐక్యం తిప్పికొడితేగానీ రాష్ట్రానికి మనుగడ లేదన్నారు.

సదస్సులో రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, పార్టీ కంట్రోల్ కమిటీ చైర్మన్ కామేశ్వరరావు, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు శంకర్ నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెంచలయ్య, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాన్సన్ బాబు, మహిళా సమైక్య రాష్ట్ర నాయకురాలు ఈ విమల, సిపిఐ విశాఖ అర్బన్ కార్యదర్శి ఎం .పైడిరాజు, సిపిఎం కార్పొరేటర్ గంగారాం, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ శంకరరావు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్ శివాజీ, సిపిఐ అనకాపల్లి జిల్లా సహాయ కార్యదర్శి రాజన దొరబాబు, మాకిరెడ్డి రామనాయుడు, జిల్లా సమితి సభ్యులు కే సన్యాసిరావు, రైతు సంఘం నాయకులు రెడ్డిపల్లి అప్పలరాజు, సిపిఐ నాయకులు వై .ఎన్. భద్రం, కోరుబిల్లి శంకరరావు, తాకాసి వెంకటేశ్వరరావు, యువజన నాయకులు వియ్యపురాజు, వేముల కన్నబాబు, జీ.ఫణీంద్ర, బాబ్జి, సతీష్ పాల్గొన్నారు.

## కసాయి తండ్రిని కఠినంగా శిక్షించాలి

### ఐద్వా ఆధ్వర్యాన నిరసన

నిరసన తెలుపుతున్న ఐద్వా నాయకులు

**ప్రజాశక్తి. -అనకాపల్లి** : ఆరేళ్ల బాలికపై అత్యాచారం చేసిన కసాయి కన్నతండ్రిని కఠినంగా శిక్షించాలని ఐద్వా నేతలు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని శంఖవరంలో ఐద్వా ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఐద్వా నేతలు మాట్లాడుతూ కూతురిపై అత్యాచారానికి పాల్పడడంతోపాటు ఎవరితోనైనా చెప్పితే చంపేస్తానని నిందితుడు బెదిరించడం ఘోరమన్నారు. పాప పరిస్థితిని చూసి కన్నతల్లి అడిగితే, ఇద్దరినీ పెట్రోల్ పోసి చంపేస్తానని బెదిరిస్తున్న కసాయి తండ్రిపై పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి, ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారించి కఠినంగా శిక్షించాలని కోరారు. ఐద్వా జిల్లా అధ్యక్షులు పి మాణిక్యం, జిల్లా ఉపాధ్యక్షులు కెవి.సూర్యప్రభ,జిల్లా జాయింట్ సెక్రెటరీ డి వరలక్ష్మి, జిల్లా కమిటీ మెంబర్లు సుభాషిణి, జి లక్ష్మి, ఆర్ లక్ష్మి, జి లక్ష్మి, సిహెచ్ మంగ పాల్గొన్నారు.

## ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలి: కలెక్టర్

అధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ రవిసుభాష్

**ప్రజాశక్తి-అనకాపల్లి** : జిల్లాలో ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులను కలెక్టర్ రవిసుభాష్ పట్టన్ శెట్టి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశమందిరంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతూరైతు భరోసా కేంద్రాలు, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ లు, వెల్నెస్ సెంటర్లు, డిజిటల్ లైబ్రరీస్ నిర్మాణాలలో అలసత్వం సహించేది లేదన్నారు. మండలాల వారిగా ఆయా భవన నిర్మాణాల ఆలస్యానికి కారణాలను అడిగి తెలుసుకొని పరిష్కారాలను సూచించారు. ఏమైనా సమస్యలుంటే వెంటనే తన దృష్టికి తేవాలన్నారు. తీసుకురావాలని తెలిపారు. భవన నిర్మాణాలకు పురోగతికి సంబంధించి సమాచారాన్ని ప్రతిరోజు తెలియజేయాలని పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో అనకాపల్లి, నర్సీపట్నం ఇఇలు కె..శ్రీనివాసరావు, వి నగేష్‌బాబు, డిఇఇలు, ఎఇఇలు పాల్గొన్నారు.

## రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ధర్మ శ్రీ

**ప్రజాశక్తి-చోడవరం** : చోడవరం కొత్తూరు జంక్షన్ నుండి తిమ్మనపాలెం వరకు బిటి రోడ్డు నిర్మాణ పనులకు శనివారం కొత్తూరు జంక్షన్ వద్ద ఎమ్మెల్యే ధర్మశ్రీ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.2.83కోట్లతో పి ఎస్ పేట రోడ్డు నిర్మాణ పనులు చేపడు తున్నామన్నారు. దీంతో ఎప్పటి నుండో ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలకు కష్టాలు తీరుతాయ న్నారు. అలాగే గవరవరం, లక్ష్మీపురం, గౌరీపట్నం రోడ్ల నిర్మాణాలకుత్వరలో నిధులు మంజూరౌతాయన్నారు. కార్యక్రమంలో డిసిఎంఎస్ చైర్మన్ నరసింహారావు, కమిటీ చైర్మన్ సత్యారావు, స్థానిక ఎంపిపి గాడి కాసు, ఆర్అండ్‌బి అధికారులు, వైసిపి నేతలు పాల్గొన్నారు.

**బుచ్చయ్యపేట :** మండలంలో పెద్ద మదీనాజంక్షన్ నుండి పిల్లవానిపాలెం వరకు రూ.183.57కోట్లతో రోడ్డు అభివృద్ధి పనులకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ శనివారం పెద్ద మదీనా వద్ద శిలాఫలకాన్ని ఆవిష్కరించి, శంకుస్థాపన చేశారు. పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో పలు రోడ్ల మరమ్మత్తులకు నిధులు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కొలిమల్ల అచ్చంనాయుడు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, సర్పంచులు మరిసా నాని, కెవిఎఎస్ నాయుడు, బుచ్చయ్యపేట పిఎసిఎస్ అధ్యక్షులు సుంకర శ్రీను, కోరుకొండ అప్పల నాయుడు, తహశీల్దార్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు

## ఘనంగా డైట్ స్నాతకోత్సవం




విద్యార్థులకు వెండి పతకాలు అందిస్తున్న అతిథులు

**ప్రజాశక్తి- అనకాపల్లి** :స్థానిక దాడి ఇనిస్టిట్యూట్ అఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ(డైట్)లో 14వ స్నాతకోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. బిటెక్ పూర్తి చేసుకున్న 2019-23 బ్యాచ్ ఇంజనీరింగ్ విద్యార్థులకు పట్టాలను పంపిణీ చేశారు. జెఎన్‌టియు జివి (విజయనగరం ) ఉప కులపతి ప్రొఫెసర్ డాక్టర్ కె .వెంకట సుబ్బయ్య, స్కీమాక్స్ టెక్ ఫౌండర్, సీఈవో సుంకర చిన్న అప్పలనాయుడు ముఖ్య అతిథులుగా పాల్గొని, పట్టాలు పొందిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠ రావు మాట్లాడుతూ కళాశాల సాధించిన ప్రగతి, నేక్ ఏ గ్రేడ్, ఎన్ఐఆర్ఎఫ్ ఆల్ఇండియాలో ర్యాంకింగ్ సాధించిందన్నారు. .విద్యార్థులందరూ మంచి ఉద్యోగాలు సంపాదించాలని ఆకాంక్షించారు. ఇసిఇ విభాగంలో టాపర్‌గా నిలిచిన విద్యార్థిని నాగం విద్యాశ్రీని 250 గ్రాముల వెండి పతకంతో సత్కరించారు. వివిధ బ్రాంచ్ టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు 50 గ్రాముల వెండి పతకం అందజేశారు. కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు

## ఆన్‌లైన్‌లో విద్యుత్ బిల్లులు చెల్లించండి

**ప్రజాశక్తి- చోడవరం :** వినియోగదారులు విద్యుత్ బిల్లులు నేరుగా చెల్లించుటకు డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని ఎపిఇపిడిసిఎల్ డిఇఇ యు కుమార్ గౌరీప్రసాద్ అన్నారు. గూగుల్ ప్లే స్టోర్‌లో ఈస్టర్న్ పవర్ యాప్ డౌన్లోడ్ చేసుకుని మొబైల్ ఫోన్ ద్వారా చెల్లింపులు జరపవచ్చున్నారు. విద్యుత్ వినియోగదారులు తమ సర్వీసును ఆధార్‌కు అనుసంధానం చేసుకునేందుకు ఆధార్ జిరాక్స్‌ను తమ కార్యాలయ సిబ్బందికి ఇవ్వాలన్నారు. గతంలో సర్వీస్ ఉండి ప్రస్తుతం ఆ వ్యక్తులు లేనట్లయితే వారి వారసులు తమ ఆధార్ జిరాక్సులను తమ కార్యాలయానికి ఇచ్చి సర్వీసును తమ పేరు మీద మార్చుకునే వీలు కల్పిస్తున్నామన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి తామెప్పుడు వినియోగదారులకు అందుబాటులో ఉంటామని, తమ సేవలను వినియోగించుకోవాలనికోరారు.

## దేవుని మాన్యం భూములు కొని నష్టపోవద్దు

### అడ్డగోలుగా రిజిస్ట్రేషన్లు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోండి : వెంకన్న

దేవాలయ భూముల్లో రియల్టర్ల అమ్మకాల కౌంటర్

**ప్రజాశక్తి- దేవరాపల్లి:** దేవునిమాన్యం భూముల క్రయవిక్రయాలు చట్టప్రకారం చెల్లవని, కాదని ఎవరైనా చేస్తే నష్టపోకతప్పదనిసిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి వెంకన్న హెచ్చరించారు. మండలంలోని మారేపల్లి రెవెన్యూ సర్వేనెంబరు 115లో 23.15 ఎకరాల భూములు ఉన్నాయని, వీటి క్రయవిక్రయాలు చెల్లవని దేవాదాయశాఖ అధికారులు పదేపదే చెబుతున్నప్పటికీ, రియల్టర్లు దేవునిమాన్యం భూముల్లో ప్రతి ఆదివారం మార్కెట్ డే నిర్వహించి, ఆయా భూములు అమ్మకాలు, రిజిస్ట్రేషన్లు చేపడుతున్నారన్నారు. అసలు విషయం తెలియని ఇతర ప్రాంతాలకు చెందిన వారెందరో వచ్చి వీటిని కొనుగోలు చేసుకుంటున్నారన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు చెప్పే కల్లిబొల్లి మాటలను నమ్మి దేవాలయ భూముల్లో వేసిన ప్లాట్లను కొనుగోలు చేయవద్దని హితవు పలికారు. రెవెన్యూ అధికారుల నిర్వాకం వల్లే ఇదంతా జరుగుతోందని వెంకన్న ఆవేదన వ్యక్తం చేశారు. ఈ భూములపై ఒకవైపు అధికారులతో సంప్రదింపులు జరుపుతూనే, మరోవైపు అమ్మకాలు చేస్తున్న రియల్టర్ల మోసాలను ప్రజలు గమనించాలని,వీరికి సహకరిస్తున్న రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని వెంకన్న కోరారు..

## సాగర్ ఇన్‌స్టా పవర్ సిమెంట్ ప్రారంభం

ప్రారంభిస్తున్న సాగర్ జెఎండి శ్రీకాంత్‌రెడ్డి

**ప్రజాశక్తి - కశింకోట** : మండలంలోనిబయ్యవరం గ్రామంలో సాగర్ సిమెంట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఇన్‌స్టా పవర్ సిమెంట్‌ను శనివారం సాగర్ సిమెంట్ జెఎమ్‌డి శ్రీకాంత్‌రెడ్డి ప్రారంభించారు ఈసందర్భంగా మాట్లాడుతూ, ఇళ్లు, ఇతర నిర్మాణాలకు అనువుగా ఈ పవర్ సిమెంట్‌ను రూపొందించామన్నారు. కార్యక్రమంలో గ్రూప్ ప్రెసిడెంట్ గణేష్, ప్లాంట్ మేనేజర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు

## 'అంతిమయాత్ర' వాహనం వితరణ

దాతలు అందజేసిన వాహనం

**ప్రజాశక్తి - యలమంచిలి** : మున్సిపాలిటీ పరిధిలో మృతుల దహన సంస్కారాలకు 'అంతిమ యాత్ర' వాహనాన్ని దాతలు శనివారం మున్సిపాలిటీకి అందజేసినట్లు మున్సిపల్ శానిటరీ ఇనస్పెక్టర్ పల్లా శ్రీనివాస రావు తెలిపారు. తులసీరావు పేరిట, కౌన్సిల్ సభ్యులు, పుర ప్రజలు, ఆడారి సహకారంతో 'అంతిమ యాత్ర' వాహనాన్ని తయారు చేసి అందజేశారన్నారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ రమాకుమారి ఆదేశాలతో అంతిమయాత్ర వాహనం శనివారం నుంచి వినియోగంలోకి తెచ్చామన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 25 వార్డుల ప్రజలు దహన సంస్కారాలకు నామమాత్రపు రుసుం రూ.1,000లు చెల్లించి 'అంతిమయాత్ర' వాహనం వినియోగించుకోవచ్చుని, శానిటరీ ఇనస్పెక్టర్ మొబైల్ నెంబరు 961849643కు సంప్రదిచాలన్నారు.

## 21న అధ్యాపకుని పోస్టు భర్తీకి ఇంటర్వ్యూ

**ప్రజాశక్తి -దేవరాపల్లి** : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలోఇంటర్మీడియట్ కంప్యూటర్ సైన్స్ ఒకేషనల్ కోర్సు బోధనకు నెలకు రూ.పదివేలు పారితోషకంతో పనిచేయుటకు అధ్యాపకుని పోస్టు భర్తీ చేయనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ బి .రాధ తెలిపారు. బిటెక్ కంప్యూటర్స్ లేదా ఎంఎస్ సి కంప్యూటర్స్ లేదా ఎంసిఎలో 50శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన అర్హత కలిగిన అభ్యర్థులు, ఈనెల 21న సోమవారం ఉదయం 10 గంటలకు అర్హత ధ్రువీకరణలతో ప్రభుత్వ జూనియర్ కళాశాలఉ నేరుగా హాజరు కావాలని కళాశాల ప్రిన్సిపల్ బి .రాధ కోరారు.

## జనసేన కార్యాలయానికి శంకుస్థాపన

**ప్రజాశక్తి - యలమంచిలి** :నియోజకవర్గంలో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలనే ఉద్దేశ్యంతో నాలుగు మండలాల్లోనూ 'జనసేన' కార్యాలయాలు నిర్మిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుందరపు విజయకుమార్ అన్నారు. శనివారం యలమంచిలి రైల్వే స్టేషన్ రోడ్డు సమీపంలో నిర్మిస్తున్న 'జనసేన' ప్రాంతీయ కార్యాలయానికి శంకుస్థాపన చేశారు.. తెలుగుదేశం - జనసేనల మధ్య పొత్తు ఖరారైతే యలమంచిలి నుంచి పోటీ చేయడానికి సంసిద్ధత వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు బొద్దపు శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు కొఠారు నరేష్, పార్టీ రూరల్ అధ్యక్షులు లాలం సోమునాయుడు, జనపరెడ్డి శ్రీనివాసు, రాంబిల్లి దొర, లోవరాజు, చిట్టిబాబు, భాస్కర్, బుల్లిబాబు, సతీష్ పాల్గొన్నారు.

## శ్రీవారి సన్నిధిలో మంత్రి అమర్

తిరుపతి వెంకన్న దర్శనానికి వెళ్లిన అమర్

**ప్రజాశక్తి- అనకాపల్లి** :తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామిని శనివారం రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్నాథ్, ఆంధ్రప్రదేశ్ ఇన్‌లాండ్ వాటర్ వేస్ ఛైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్ దర్శించుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి పూజలు నిర్వహించారు.

## పంట వివరాల నమోదు తప్పనిసరి

**ప్రజాశక్తి- కె.కోటపాడు** : ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన పంటలు వివరాలను రైతులందరూ సమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్ సూచించారు.కొన్ని గ్రామాల్లో వరి నాట్లు పూర్తయిన నేపథ్యంలో, రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి వ్యవసాయ సహాయకుల ద్వారా పంట వివరాలు నమోదు చేయించుకోవాలన్నారు . పంట నమోదుతో పైరుకు పంటల బీమా వర్తిస్తుందన్నారు. ప్రకృతి విపత్తుల వలన పంట నష్టాలకు పరిహారం లభిస్తుందన్నారు. ప్రభుత్వం ప్రకటించే మద్దతు ధరకు రైతు ధాన్యం అమ్ముకోవచ్చున్నారు. సున్నా వడ్డీ, ఇతర ప్రభుత్వ పథకాలు వర్తించాలంటే పంటల నమోదు తప్పనిసరి అన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో యూరియా, డిఎపి సిద్ధంగా ఉన్నాయని, వాటిని వినియోగించుకోవాలని సూచించారు.

# బదిలీ ఉపాధ్యాయులకు

# వేతనాలు చెల్లించకపోవడం సిగ్గుచేటు

### ఫ్యాప్టో ఆధ్వర్యాన డిఇఒ కార్యాలయాల వద్ద నిరసన

అనకాపల్లి డిఇఒ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు

**ప్రజాశక్తి-అనకాపల్లి** : ఈ ఏడాది బదిలీలు, ప్రమోషన్లు పొందిన ఉపాధ్యాయులకు మూడు నెలలుగా ప్రభుత్వం జీతాలు చెల్లించక పోవడం సిగ్గు చేటని ఫ్యాప్టో జిల్లా అధ్యక్షులు గొంది చినబ్బాయ్ అన్నారు. శనివారం దీనికి నిరసనగా ఫ్యాప్టో ఆధ్వర్యాన డిఇఒ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. నిరసన కార్యక్రమంలో చిన్నబ్బాయి మాట్లాడుతూ క్యాడర్ స్ట్రెంత్ పేరుతో జీతాలు ఆపడం సరి కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జూన్ నెలలో కొత్త పోస్టులు ఏమీ మంజూరు చేయలేదని, అయిన్సా జీతాలు ఇవ్వక పోవడం దారుణమన్నారు. బదిలీ అయ్యి కొత్త స్థానాల్లో చేరి మూడు నెలలు పూర్తి కాకుండానే మరలా ఉపాధ్యాయుల పని సర్దుబాటు చేయుట సరికాదన్నారు. మూడు నెలలైనా జీతాల సమస్య పరిష్కారం కాలేదని, సమస్య పరిష్కరించకుండా పని సర్దుబాటు చేయడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో సుమారుగా1800 మంది ఉపాధ్యాయులకు జీతాలు అందలేదని, వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. దీనిపై చర్యలు తీసుకోకపోవడం, ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జీతాలు చెల్లించడానికి తగిన ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. జిఒ117తో విద్యావ్యవస్థ గందరగోళానికి గురౌతోందని, దీని ఆధారంగా ఇలా సర్దుబాటు నిరంతరం చేయడం సరికాదన్నారు. తెలిపారు.ఉపాధ్యాయుల హక్కులను కాలరాయడమే కాకుండా, ఇలా మూడుమూడు నెలలకు స్థాన చలనం చేయడం ద్వారా ఇబ్బందులకు గురిచేయడం సరికాద న్నారు. 3,4,5 తరగతులను ఉన్నత పాఠశాలలలో విలీనం చేయడం వలన విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిందని వాపోయారు. కార్యక్రమంలో సెక్రటరి జనరల్ వై. సుధాకర్ రావు, కో - ఛైర్మన్, కె. సాయి ప్రసాద్, డిప్యూటీ సెక్రటరి జనరల్ ఎన్. సన్యాసి నాయుడు, కోశాధికారి కె . పరదేశి, సెక్రటరి సిహెచ్. నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు వి. శ్రీలక్ష్మి, ఎం. శ్రీను, ఎన్ వి. సూర్య, సీనియర్ నాయకులు రమేష్ రావు, మధు, ఆచంట రవి, పొలిమేర చంద్రరావు వేణుగోపాల్,ఎల్లయ్య బాబు, నూకేష్ పాల్గొన్నారు.

**వర్క్ అడ్జస్ట్‌మెంట్ ప్రక్రియను నిలిపేయాలి : ఫ్యాప్టో**

**ఆరిలోవ** : పాఠశాల విద్యలో గందరగోళానికి గురిచేస్తున్న అసంబద్ధమైన వర్క్ అడ్జస్ట్‌మెంట్ ప్రక్రియను వెంటనే నిలుపుదల చేయాలని విశాఖ జిల్లా ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య డిమాండ్ చేసింది. ఫ్యాప్టో విశాఖ జిల్లాకమిటీ ఆధ్వర్యాన పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు శనివారం డిఇఒ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో ఛైర్మన్ డి.జోజిబాబు మాట్లాడుతూ, ఇటీవల ఉపాధ్యాయులకు ప్రమోషన్లు, బదిలీలు నిర్వహించారని, వారికి నేటికీ జీతాలు చెల్లించక పోగా బదిలీలు పొందిన వారిలో కొంతమందిని వర్క్ అడ్జస్ట్‌మెంట్ పేరుతో వేరే పాఠశాలకు పంపేందుకు రంగం సిద్ధమైందని వివరించారు. పాఠశాల విద్యను అస్తవ్యస్తం చేస్తున్న జిఒ 117ను రద్దు చేయాలని, సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో రాష్ట్ర కో-ఛైర్మన్ సిహెచ్. వెంకటేశ్వర్లు, ఫ్యాప్టో జిల్లా నాయకులు టి.రామ కృష్ణారావు, దాసరి నాగేశ్వరరావు, టిఆర్.అంబేద్కర్, పి.దేముడుబాబు, ఎ.ధర్మంద్రరెడ్డి, ఎవి.వీరభద్రరావు, జి.ప్రకాష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## గీత కార్మిక సంఘాల లైసెన్స్ రెన్యువల్ చేయాలి

**ప్రజాశక్తి- కె.కోటపాడు:** కల్లు గీత పారిశ్రామిక సంఘాల లైసెన్సులు వెంటనే రెన్యువల్ చేయాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్ర దేవుడు డిమాండ్ చేశారు శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పొరుగున ఉన్న విశాఖపట్నం, విజయనగరం జిల్లాలో ఉన్న గీత కార్మికుల సంఘాలకు లైసెన్సులు ఇప్పటికే ఎక్సైజ్ అధికారులు జారీ చేశారని, అనకాపల్లి జిల్లాలో మాత్రం ఇప్పటివరకు ఆ ప్రస్తావన తేలేదు అన్నారు. అనకాపల్లి జిల్లాలో 100 కల్లుగీత పారిశ్రామిక సంఘాలు ఉన్నాయని, వీటి లైసెన్సులు 2022 డిసెంబర్‌తో ముగిశాయని, వెంటనే లైసెన్సులు రెన్యువల్ చేయాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. నర్సీపట్నం డివిజన్ బలిఘట్టం గ్రామంలో 15 మందికి పిఎఫ్‌టి లైసెన్సులు ఇవ్వాల్సి ఉండగా, వారినీ ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. విశ్వకర్మ సంఘాల కుటుంబాలకు ఐదు శాతం వడ్డీతో రూ.లక్ష రుణం ఇస్తామని స్వాతంత్ర్యతదినోత్సవం రోజున ప్రకటించిన ప్రధాని మోడీ గీత వత్తిదారుల, యాత కులస్తుల ప్రస్తావన లేకపోవడం అన్యాయమన్నారు.

## విద్యార్థులకు అట్టలు, పలకల పంపిణీ

అట్టలు పంపిణీ చేస్తున్న సోమేశ్వరరావు

**ప్రజాశక్తి- కశింకోట** : మండలంలోని ఉగ్గినిపాలెం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు రైటింగ్ ప్లాంక్‌లు, పలకలను మండల తెలుగుదేశంపార్టీ ఉపాధ్యక్షుడు కలగా సోమేశ్వరరావు ఆర్థిక సహాయంతో శనివారం అందజేశారు . ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతోపాటు ఆటలు పాటల్లో రాణించాలన్నారు. ఎంఇఒ-2 సూర్యానారాయణ మూర్తి,.టిడిపి నాయకులు కరణం గోవింద, పాధ్యాయులు బి జ్ఞానేశ్వరి, ఎం. కుమారి, సునీతా దేవి, ఆర్.అనురాధ, టి.పైడిరాజు పాల్గొన్నారు.

## త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు

లబ్ధిదారులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి

**ప్రజాశక్తి- దేవరాపల్లి** : జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులు త్వరతగతిన పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి రవీంద్ర లబ్ధిదారులను కోరారు. శనివారం మండలంలోని చంద్రయ్యపేట గ్రామంలో జగన్న లేఅవుట్‌లో అసంపూర్తి నిర్మాణాలను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడారు.ఇళ్ల నిర్మాణాల ప్రాప్తికి ఎప్పటికప్పుడు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో బిల్లులు జమ చేస్తామన్నారు. కొందరు లబ్ధిదారులు పనులు చేపట్టకపోవడానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. వారి సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ సూపరింటెండెంట్, కెవి రమణ,. ఇఒపిఆర్‌డి నళిని, హౌసింగ్ ఎఇఇ భీమలింగేశ్వరరావు, టెక్నికల్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు

## మున్సిపల్ స్థలం దురాక్రమణపై చర్యలు తీసుకోండి

టాన్‌ప్లానింగ్ అధికారులకు వినతిపత్రం ఇస్తున్న టిడిపి నేతలు

**ప్రజాశక్తి -అనకాపల్లి** : జివిఎంసి అనకాపల్లి జోన్ పరిధిలో టౌన్ సర్వేనెంబర్ 348లో మిరియాల కాలనీలో అక్రమణకు గురైన స్థలాన్ని తక్షణమే స్వాధీనం చేసుకోవాలని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం జోనల్ కార్యాలయంలో ఎసిపికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దీనిపై ఇప్పటికే అన్ని రాజకీయ పక్షాలు ప్రజా సంఘాలు ఫిర్యాదులు చేసినప్పటికీ జివిఎంసి టౌన్‌ప్లానింగ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. లోకాయుక్తను కూడా కొందరు ఆశ్రయించారన్నారు. మున్సిపాలిటీకి చెందిన 16 సెంట్లు ప్రభుత్వ భూమిని ఉద్యోగులకు గృహాలు, హౌసింగ్ సొసైటీ సహకారంతో ఎల్ఐజి తరహా గృహాలు నిర్మించారని, దాని పక్కనే తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో కల్యాణ మండపం నిర్మాణం చేశామని గుర్తు చేశారు. ఆ స్థలం పక్కనే సర్వేనెంబర్ 348లో మున్సిపల్ స్థలాన్ని వైసిపి యువ నాయకులు పలకా రవి ఆక్రమించగా 2018లో టౌన్ ప్లానింగ్ అధికారులు ప్లాను ఇచ్చారన్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తరువాత మంత్రి గుడివాడ అమర్నాథ్ సహకారంతో సొంత స్థలం ముందునే ఉన్న 11 సెంట్ల మున్సిపల్ స్థలాన్ని ఆక్రమించి రిజిస్ట్రేషన్ చేసుకుని అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపించారు.దీనిపై జివిఎంసి సర్వేయర్‌తో సర్వే చేయించి, ఆక్రమణలను తొలగించి, మున్సిపల్ స్థలం స్వాధీనం చేసుకోవడంతోపాటు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆళ్ల రామచంద్రరావు, సూరే సతీష్, కోట్ని రామకష్ణ, మల్ల గణేష్, కుప్పిలి జగన్మోహన్, అండిబోయిన శేషు, గుడాల సత్యనారాయణ, పూడి త్రినాధ్, బుద్ధ భువనేశ్వరరావు, విల్లూరి రమణబాబు,

# అక్రమ నిర్మాణ పనులు అడ్డగింత

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతం మండలం మేజర్ పంచాయితీ కొత్తకోట సచివాలయం -3 సమీపంలో విలువైన ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమణతో చేపట్టిన నిర్మాణ పనులను తహసీల్దార్ మహేశ్వర రావు, విఆర్వో లక్ష్మి తదితరులు శనివారం నిలుపు చేశారు. గ్రామానికి చెందిన వేమవరపు నానాజీ, ఉపసర్పంచ్ పందల దేవ గత కొన్నాళ్ళు కిందట సర్వే నెంబర్ 147/4 ప్రభుత్వ గయ్యాళి, 244/2ఎ గ్రామ కంఠంలలో సుమారు 0.06 సెంట్లు స్థలాన్ని ఆక్రమణలు చేసినట్టుగా పలు ఆరోపణలు వచ్చాయి. దీనిపై గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ మండల రెవెన్యూ అధికారులకు పలు ఫిర్యాదులు చేశారు. దీనిపై విచారించిన తహసిల్దార్ మహేశ్వరరావు సదరు స్థలం ప్రభుత్వా నీదే అంటూ తేల్చారు. దీనిపై ఉప సర్పంచ్ దేవ, మరో వ్యక్తి నానాజీ కోర్టును ఆశ్రయించారు. సమస్య ప్రస్తుతం కోర్టులో ఉంది. అయితే కోర్టు నుంచి తమకు అనుమతి లభించిందంటూ శనివారం నిర్మాణ పనులు చేపట్టడంతో మరో మారు ఆ స్థలం వద్ద ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. సమాచారం తెలిసిన తహసిల్దార్, వీఆర్వో పనులను నిలుపు చేయించా రు. సదరు స్థలములో ఎటువంటి నిర్మాణ పనులు చేపట్టకుండా ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేయాలని స్థానిక రెవిన్యూ అధికారులతో పాటు పోలీసులకు తహసిల్దార్ ఆదేశాలు జారీ చేశారు.

ఈ విషయమై తహసీల్దార్మహేశ్వరరావు మాట్లాడుతూ, సర్వే నెంబర్ 147/4, 244/2ఎ గ్రామకంఠం కలిపి సుమారు 0.32 సెంట్ల ప్రభుత్వ భూమి ఉందన్నారు. సదరు స్థలానికి పడమర భాగం సరిహద్దుగా పిడబ్ల్యుడి పంట కాలువ ఉండేదన్నారు. అది కూడా కబ్జా కు గురైందన్నారు. ఉపసర్పంచ్, నానాజీ వద్ద రికార్డులలో గ్రామకంఠం 244/2సిగా ఉందన్నారు. సర్వే నెంబర్ లేదని పేర్కొన్నారు. ప్రస్తుతం సమస్య కోర్టు లో ఉన్న కారణంగా ఎటువంటి నిర్మాణాలు చేపట్టరాదని తహసీల్దార్ స్పష్టం చేశారు.

నిర్మాణాలను పరిశీలిస్తున్న అధికారులు

ధన్యవాదాలు తెలుపుతున్న గిరిజనులు, విద్యార్థులు

## అణుకులో శిక్షణా కేంద్రం ప్రారంభం

### - సిపిఎం నేతలు, గిరిజనులు హర్షం

ప్రజాశక్తి-కోటవురట్ల:గొట్టువాడ శివారు అణుకు గ్రామానికి నాన్ రెసిడెన్షియల్ స్పెషల్ ట్రైనింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్టిసి)ను శనివారం మండల విద్యాశాఖ అధికారి టి.రామారావు, విద్యాశాఖ అధికారి 2 డి,జోష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గిరిజనులు, విద్యార్థులు విద్యాశాఖ సిబ్బందికి పూల బొకేలతో ఘన స్వాగతం పలికి గిరిజన సాంప్రదాయ పద్ధతిలో ఆకులతో టోపీలతో సత్కరించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాల ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని పేర్కొన్నారు. సిపిఎం జిల్లా నాయకులు అప్పలరాజు మాట్లాడుతూ, 44 రోజులుగా దీక్ష చేయడంతో కలెక్టర్, విద్యాశాఖ అధికారులు పాఠశాలను మంజూరు చేయడం పట్ల ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా గ్రామానికి రహదారి మౌలిక వసతులు కల్పించాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ, ఎం.సూరిబాబు, జి రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

భారీ అన్నసమారాధన ఏర్పాటు

## వెంకన్న ఆలయం కిటకిట

ప్రజాశక్తి -నక్కపల్లి:ఉపమాక వెంకన్న ఆలయం శనివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కొండపైన, కొండ దిగువున స్వామివారిని దర్శించుకున్నారు. దేవస్థానం ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు, అర్చకులు పీసపాటి వెంకట శేషాచార్యులు, నల్లాన్ చక్రవర్తుల శ్రీనివాసులు, భాగవతం గోపాల ఆచార్యులు ఆధ్వర్యంలో నిత్య పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల వర ప్రసాదా చార్యులు, దాతల సహకారంతో శనివారం ఆలయ ప్రాంగణం వద్ద సుమారు 1000 మంది భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ విజయవాడ జోన్ డిప్యూటీ ఈవో వెంకటయ్య, ఋషికొండ దేవస్థానం సూపరింటెండెంట్ వెంకటరమణ, దేవస్థానం సిబ్బంది గురవయ్య, గ్రామానికి చెందిన రేజేటి సింగరా చార్యులు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

# డోలీపై ఏడు కిలో మీటర్లు తరలింపు

ప్రజాశక్తి-రోలుగుంట:అనారోగ్యంకు గురైన వ్యక్తిని ఏడు కిలోమీటర్లు డోలీ మోతలో తరలించిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. రోలుగుంట మండలం ఆర్ల పంచాయతీ పిత్రిగడ్డ కొండ శిఖర గ్రామం కొర్ర సుబ్బారావు (52) సంవత్సరాలు గత వారం రోజులుగా కడుపు నొప్పి, జ్వరంతో బాధపడుతున్నాడు. పిత్రిగడ్డ గ్రామంతో పాటు నీలిబంద, పెద్దగురువు, కొయ్యూరు మండలం జాజులబంద పిటిజి కొందు 300 మంది జనాభా కొండ శిఖరం గ్రామంలో జీవనం సాగిస్తున్నారు. రోడ్డు నిర్మాణం చేసుకునేందుకు ప్రతి ఇంటికి 2000 రూపాయలు చందాలు వేసుకొని సొంతంగా రోడ్డు నిర్మాణం చేసుకున్నారు. భారీ వర్షాలు రావడంతో రోడ్డు కొట్టుపోయింది. దీంతో దిక్కు తోచని స్థితిలో కొర్ర సుబ్బారావును కుటుంబ సభ్యులు పిత్రిగడ్డ నుండి ఆర్ల పంచాయతీ కేంద్రం వరకు ఏడు కిలోమీటర్లు ఎత్తైన కొండను శిఖరం మధ్య నుండి డోలీలో మోసుకొస్తూ ఆటోలో నర్సీపట్నం ఏరియా హాస్పిటల్కి తీసుకువెళ్లారు. గ్రామాలకు రోడ్లు వేయాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

డోలీలో మోసుకెళ్తున్న కుటుబీకులు

## సాగునీటి సరఫరాలో విఫలం

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:రావణాపల్లి రిజర్వాయర్ కింద సాగు చేస్తున్న రైతుల పంట పొలాలకు పూర్తిస్థాయిలో నీరు అందించడంలో పాలకులు, అధికారులు విఫలమయ్యారని జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీర సూర్యచంద్ర ఆరోపించారు. నర్సీపట్నం మండలం నీలంపేట సమీపంలో రావణాపల్లి రిజర్వాయర్ పరిధిలో ఎండిపోతున్న పొలాలను, కాలువలను పరిశీలించారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ,రావణాపల్లి రిజర్వాయర్ నుంచి నీరు శివారు భూములకు చేరలేదన్నారు. రిజర్వాయర్ కాలువలు పూర్తి స్థాయిలో పూడికపోయి తుప్పలు, డొంకలు పెరిగి పోయాయన్నారు. దీంతో శివారు భూములకు నీరు అందక వరినాట్లు ఎండిపోతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం టౌన్ అధ్యక్షులు అద్దేపల్లి గణేష్, నాయకులు కొత్తకోట రామశేఖర్, పోనుబోతుల నాగు, రాజా పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆర్డిఒ

## ధీరజ్ ప్రతిభ అమోఘం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ :స్థానిక వాసవి కళ్యాణ మండపంలో వరల్డ్ ఫోటోగ్రఫీ డే సందర్భంగా శనివారం ఫోటో ఎగ్జిబిషన్ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని చింతకాయల సన్యాసిపాత్రుడు ఆధ్వర్యంలో పాడుతా తీయగా ఫేమ్ సింగర్ ధీరజ్ తీసిన ఫోటోలను శనివారం ప్రదర్శించారు. ఆర్డిఓ సిహెచ్ జయరామ్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, అతి చిన్న వయసులో అద్భుతమైన గానంతో అలరించడమే కాకుండా ఆయన తీసిన ఫోటో షూట్ చేయడం అభినందనీయమన్నారు. చింతకాయల సన్యాసి పాత్రుడు మాట్లాడుతూ, ధీరజ్ జనగణమన పాటను అద్భుతమైన గానంతో పాడటమే కాకుండా ఛాయాచిత్రాలు తీయడంలోనూ నైపుణ్యత ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ గవర్నర్ అధికార గోపాలరావు, నారాయణరావు పాల్గొన్నారు.

## కొండబాబుకు అనిత పరామర్శ

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని ఉపమాక గ్రామానికి చెందిన జిల్లా పరిషత్ కో ఆప్షన్ మాజీ సభ్యులు, టిడిపి నేత కొప్పిశెట్టి కొండబాబు, బుజ్జి లను శనివారం తెలుగుదేశం పార్టీ పోలిట్ బ్యూరో సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత పరామర్శించారు. కొండబాబు మాతృమూర్తి కృష్ణవేణి అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. అనిత కొండబాబు కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు. పరామర్శించిన వారిలో తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేశ్, పార్టీ నాయకులు జానకి శ్రీను, అబద్ధం, గుర్రం రామకృష్ణ, గింజాల లక్ష్మణరావు, రమణ, సుంకర బాబ్జి, తిరుమలరావు ,బుజ్జి, కనకారావు ఉన్నారు.

పరామర్శిస్తున్న అనిత

స్వాధీనం చేసుకున్న పోలీసులు

## 700 లీటర్ల సారా పులుపు ధ్వంసం

ప్రజాశక్తి - రావికమతం: మండలంలో గుడివాడ పంచాయతీ పిల్లవానిపాలెం గ్రామ సమీపంలో 700 లీటర్ల నాటుసారా పులుపులను ధ్వంసం చేసినట్లు రావికమతం ఎస్సై ఉమామహేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా తమకు అందిన సమాచారం మేరకు.. గ్రామ పరిసర ప్రాంతాల్లో సిబ్బందితో సారా పులుపును ధ్వంసం చేయగా ఆ ప్రదేశంలో ఎవరూ లేకపోవడంతో నిందితులను గుర్తించేందుకు దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నిరసన చేపడుతున్న బాధితులు

## చిట్టీల బాధితుల నిరసన

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ :చీటీల వ్యాపారం చేస్తూ కోట్లాది రూపాయలు కట్టించుకుని మోసగించాడని పలువురు బాధితులు జనసేన నాయకుడు గుండు బోయిన శ్రీను ఇంటి ముందు బాధితులు శనివారం నిరసన చేపట్టారు.జనసేన నాయకుడు శ్రీను గత కొన్ని సంవత్సరాలుగా నర్సీపట్నం నియోజకవర్గంలో గొలుగొండ, నాతవరం, నర్సీపట్నం పలు ప్రాంతాల్లో గండుబోయిన చీటీల వ్యాపారం చేస్తూ కోట్లాది రూపాయలు కట్టించుకుని మోసగించాడని పలువురు బాధితులు తెలిపారు. దీంతో బాధితులు ఆయన ఇంటి ముందు నిరసన చేస్తూ డబ్బులు ఇవ్వాలని అడిగినప్పటికీ ఆయన పొంతనలేని సమాధానాలు చెపుతున్నారన్నారు. వారం రోజుల్లో ఇస్తానని శ్రీను తెలియజేయడంతో బాధితులు ఆందోళన విరమించారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి -కోటవురట్ల: బికే పల్లి గ్రామానికి చెందిన చవ్వాకుల రమేష్ గత సంవత్సరం జరిగిన రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో తలకు రెండుసార్లు సర్జరీ చేయించుకుని గ్రామానికి తిరిగి రావడంతో రాక్ యూత్ సభ్యులు బాధిత కుటుంబానికి లక్ష 25 వేల గ్రామ సర్పంచ్ లింగన్న నాయుడు చేతుల మీదుగా ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ హరిచంద్ర ప్రసాద్, రామచంద్ర పాలెం మాజీ సర్పంచ్ రాము, పెట్ల నాయుడు, పెట్ల నరేష్, శ్రీరామ్ రెడ్డి, పాలు రమణ, రాక్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

నగదు ఇస్తున్న రాక్ యూత్ సభ్యులు

## పశువైద్య శిబిరం

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలోని కె.నాయుడుపాలెంలో పశు గర్భ కోశ వ్యాధుల చికిత్సకు స్థానిక గోపాలమిత్ర సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. రోలుగుంట పశు వైద్యులు నూకేశ్వరరావు, గ్రామ సర్పంచ్ గుములూరు సన్యాసి నాయుడు ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో 16 పశువులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. సుమారు 60 పశువులకు వ్యాధి నివారణ టీకాలు, నట్టల నివారణ మందు అందించారు.

పరీక్షలు చేస్తున్న వైద్యులు

బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వావా

## విశాఖ పోర్టు అధారిటీని సందర్శించిన పిపి.వావా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నేషనల్ కమిషన్ ఫర్ సఫాయి కర్మచారి గౌరవ సభ్యులు డాక్టర్ పిపి.వావా శనివారం విశాఖపట్నం పోర్టు అథారిటీని సందర్శించారు. పోర్టు డిప్యూటీ ఛైర్మన్ దుర్గేష్ కుమార్ దూబె ఆయనకు సాదర స్వాగతం పలికారు. అనంతరం పోర్టులో జరుగుతున్న కార్యకలాపాలు, ఎగుమతులు, దిగుమతులు, యాంత్రీకరణ, మౌలిక వసతులు, ఆర్థిక స్థితిగతులు వంటి అంశాలను దూబె పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. డిసెంబర్ 2021లో పోర్టును సందర్శించిన సమయంలో లేవనెత్తిన అంశాల పురోగతిపై డాక్టర్ వావా సమీక్ష జరిపారు. పోర్టులో సఫాయి కర్మచారీల కోసం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను ఈ సందర్భంగా దూబె వివరించారు. ఈ నెల 23న విశాఖలో నిర్వహించనున్న గ్లోబల్ మారిటైం ఇండియా సమ్మిట్ -2023 రోడ్ షోలో పాల్గొనాల్సిందిగా కోరారు. పోర్టులో సఫాయి కర్మచారిలకు అందుతున్న వసతుల పట్ల వావా సంతృప్తి వ్యక్తం చేశారు.

## వైసిపి గ్రీవెన్స్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : దక్షిణ నియోజకవర్గంలోని వైసిపి కార్యకర్తల కోసం ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ శనివారం అశోక్ నగర్ ఆశీల్‌మెట్టలోని తన కార్యాలయంలో నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు వార్డులకు చెందిన కార్యకర్తలు పాల్గొని తమ తమ వార్డుల్లో చేపట్టవలసిన పనులను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. 39వ వార్డులో మత్స్యకారులకు ప్రత్యేక కమ్యూనిటీ హాల్ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని ఆ వార్డు కార్యకర్తలు కోరారు. పార్టీ కార్యకర్తలకు ఇళ్ల కేటాయించాలని 41వ వార్డ్ సీనియర్ నాయకులు కొడిగుడ్ల శ్రీధర్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో శ్రీ కనకమహాలక్ష్మి దేవస్థానం చైర్మన్ కొల్లి సింహాచలం, పార్టీ 29వ వార్డు ప్రెసిడెంట్ పీతల వాసు, 30వ వార్డు ప్రెసిడెంట్ దశమంతుల మాణిక్యాలరావు, వివిధ కార్పొరేషన్ల స్టేట్ డైరెక్టర్లు అమ్మాజీ, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఉదయశ్రీ

## గృహ నిర్మాణాలపై నిర్లక్ష్యం వద్దు

ప్రజాశక్తి -కోటవురట్ల:మండలంలో జగనన్న గృహ నిర్మాణాల పట్ల అధికారులు నిర్లక్ష్యం చేయరాదని మండల ప్రత్యేక అధికారి ఉదయశ్రీ తెలిపారు. శనివారం ఆమె సుంకపూర్‌ను సందర్శించి నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి సచివాలయ సిబ్బంది ,మండల స్థాయి అధికారులతో ఆమె మాట్లాడుతూ, నిర్మాణాలు వేగవంతం చేయాలని సూచించారు. సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్మిస్తున్న సచివాలయ, రైతు భరోసా కేంద్రాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. జల జీవన మిషన్ గ్రామీణ ప్రాంతాల్లో అర్హులందరికీ కుళాయిలు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పరిపాలనా ధికారి చంద్రశేఖర్, హౌసింగ్ ఇంజనీర్ జగదీశ్వరరావు, పిఆర్ ఇంజనీరు వర్మ, ఇంజనీర్ కరుణ పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ఉప ఎన్నికలు

ధ్రువీకరణ పత్రాన్ని ఇస్తున్న అధికారులు



మెట్టపాలెంలో అభినందిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - పరవాడ: మండలంలోని కన్నూరు పంచాయతీ ఏడో వార్డుకు నిర్వహించిన ఉప ఎన్నికలో వైసిపి బలపరిచిన అభ్యర్థి మడక అప్పారావు గెలుపొందారు. శనివారం జరిగిన పోలింగ్‌లో192 ఓట్లుకు గాను 158 ఓట్లు పోలైనాయి. ఒక ఓటును తిరస్కరించారు.వైసిపి అభ్యర్థి మడక అప్పారావుకు 96 ఓట్లురాగా టిడిపి బలపరిచిన శీరంశెట్టి సత్తిబాబుకు. 62 ఓట్లు వచ్చాయి, దీంతో 34 ఓట్ల మెజార్టీతో అప్పారావు గెలుపొందినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రకటించారు.

**మునగపాక రూరల్**: మండలంలోని మెలిపాక వార్డు సభ్యునిగా వైసిపి బలపరిచిన గొల్ల అమర వెంకట సత్యనారాయణ విజయం సాధించారు. ఆరవ వార్డు సభ్యుడు గొల్ల పైడయ్య మరణంతో ఖాళీ అయిన స్థానంలో ఉప ఎన్నిక నిర్వహించగా, వైసిపి అభ్యర్థి అమర వెంకట సత్యనారాయణ 22 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. పోటీలో టిడిపి, జనసేన అభ్యర్థులు నిలిచారు. . సత్యనారాయణ విజయంపై గ్రామ సర్పంచ్ అయినంపూడి భాస్కరరాజు, రామరాజు, ఇతర వైసిపి నేతలు అభినందించారు.

**నర్సీపట్నంటౌన్**:మండలంలో మెట్టపాలెం గ్రామం లో వార్డ్ మెంబర్ ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో తెలుగుదేశం మద్దతుదారుడు పైల కొండబాబు మూడు ఓట్ల తేడాతో గెలుపొందారని ఎన్నికల అధికారి తెలిపారు. కొండ బాబును జడ్పిటిసి సుకల రమణమ్మ, బోలెం రాంప్రసాద్, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు లాలం శ్రీరంగ స్వామి అభినందించారు.

**నక్కపల్లి**:మండలంలోని చినదొడ్డిగల్లు లో పంచాయతీ 1వ వార్డ్ మెంబర్‌గా నాయుడు నానాజీ గెలుపొందినట్లు ఆర్‌ఓ జి.సత్యనారాయణ వెల్లడించారు.పంచాయతీ 1వ వార్డుకు శనివారం నాడు నిర్వహించిన పోలింగ్ ప్రశాంతంగా జరిగింది.దాడిశెట్టి ఈశ్వరరావు, నాయుడు నానాజీ పోటీలో నిలిచారు. ఈ పోటీల్లో వైసిపి మద్దతుదారుడు నాయుడు నానాజీకి 143 ఓట్లు రాగా, దాడిశెట్టి ఈశ్వరరావుకు 142 ఓట్లు పోలయ్యాయి. దీంతో ఒక ఓటు మెజార్టీతో నాయుడు నానాజీ వార్డు మెంబర్‌గా గెలుపొందినట్లు ఆర్‌ఓ ప్రకటించారు.మొత్తం ఓట్లు 317గాను 294 ఓట్లు పోలైనట్లు ఆర్‌ఓ సత్యనారాయణ తెలిపారు.92.74 పోలింగ్ శాతం నమోదైనట్లు వెల్లడించారు.గెలుపొందిన నాయుడు నానాజీకి ధ్రువపత్రాన్ని ఆర్వో అందజేశారు.ఎస్‌ఐ శిరీష పోలింగ్ కేంద్రం వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు.

**కొత్తకోట**:రావికమతం మండలంలోని తట్టబంద 8వ వార్డు మెంబరుగా నమ్మి నాగమణి, కవగుంట 2వ వార్డు మెంబరుగా కంఠమఖి జానకి ఏక గ్రీవంగా ఎంకయ్యారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి చైతన్య శనివారం తెలిపారు. కవగుంట 2వ వార్డు మెంబరు కంఠమఖి శ్రీనివాసరావు అప్పట్లో కరోనా తో మృతి చెందగా తట్టబంద వార్డు మెంబరు అప్పలనాయుడు గుండెపోటుతో అప్పట్లో మతి చెందడంతో నోటిఫికేషన్ వెలువడగా వారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు.

**భీమునిపట్నం** : భీమిలి మండలం లక్ష్మీపురం పంచాయతీ సర్పంచ్‌గా వైసిపి బలపర్చిన లచ్చుభుక్త జగదీశ్వరరావు, టి.నగరిపాలెం పంచాయతీ 10వ వార్డు నుంచి స్వతంత్ర అభ్యర్థి పూసర్ల రామారావు ఏకగ్రీవంగా విజయం సాధించారు.

**పెందుర్తి** : మండలంలోని గొరపల్లి గ్రామంలో రెండేళ్ల క్రితం వార్డు మెంబర్ తంగేటి అప్పారావు మృతిచెందడంతో ఆ స్థానానికి శనివారం ఎన్నిక నిర్వహించారు. వార్డులో సుమారు 244 ఓట్లు ఉండగా 174 ఓట్ల వరకు పోలయ్యాయి. టిడిపి బలపరిచిన అభ్యర్థి చిన్నకు 25 ఓట్లు, వైసిపి బలపర్చిన అభ్యర్థి తంగేటి దేవుడమ్మకు 149 ఓట్లు వచ్చినట్లు అధికారులు ప్రకటించారు. వైసిపి నాయకులు సంబరాలు జరుపుకున్నారు.

**పద్మనాభం** : పద్మనాభం మండలంలో మూడు గ్రామ పంచాయతీల్లో వార్డు మెంబర్లకు నిర్వహించిన ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. చిన్నాపురం రెండవ వార్డు మెంబర్‌గా పి.కృష్ణ, రెడ్డిపల్లి 9వ వార్డు మెంబర్‌గా బి.సత్యవతి, బాంధేవపురం వార్డు మెంబర్‌గా జి.లక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

# ఘనంగా ముగిసిన శ్రీ ప్రకాష్ వార్షికోత్సవం

**- అలరించిన పాటల పోటీలు**

ప్రజాశక్తి పాయకరావుపేట:శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల 47వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా శ్రీ ప్రకాష్ డిగ్రీ ఎన్.సి.సి, ఎన్. ఎస్.ఎస్ విభాగాలు, రోటరాక్ట్ క్లబ్ విద్యార్థులు సుమారు 120 యూనిట్ల రక్తాన్ని రోటరీ బ్లడ్ బ్యాంకు (కాకినాడ) మదర్ బ్లడ్ బ్యాంకు (తుని) అందచేశారు. శ్రీ ప్రకాష్ తుని, పాయకరావుపేట, అన్నవరం, పెద్దాపురం, కాకినాడ, రాజమహేంద్రవరం బ్రాంచ్‌ల విద్యార్థులకు ఏర్పాటు చేసిన గాతా రహే మేరా దిల్ పాటల పోటీల ముగింపునకు హంగేరి దేశం నుండి ప్రముఖ పఖ్వాజ్ విద్వాంసులు, బలాజ్స్ విరాగ్ హాజరయ్యారు. అంతర్జాతీయ యోగా గురువు వబ్బలరెడ్డి దుర్గా ప్రసాద్‌ని శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల అధినేత సి. హెచ్. వి.కె. నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సి.హెచ్ విజయ్ ప్రకాష్‌లు ఘనంగా సన్మానించారు. వివిధ పోటీలు ఆసక్తిగా సాగాయి. ఈ సందర్భంగా హాజరైన ప్రముఖ పఖ్వాజ్ విద్వాంసులు బలాజ్స్ విరాగ్ మాట్లాడుతూ ,ప్రపంచంలో ఎన్నో రకాల సంగీతాలు ఉన్నా భారతీయ సంగీతం వైవిధ్యమైనదని కొనియాడారు. అందుకే భారతీయ సంగీతం పట్ల మక్కువ కలిగి పాత శైలి పఖ్వాజ్ సంగీతం ఉనికిని పరిరక్షించడానికి కృషి చేస్తున్నానన్నారు. రాబోయే తరాల వారికి మక్కువ కలిగేలా ప్రదర్శనలు ఇస్తున్నానని తెలిపారు. భారతీయ శాస్త్రీయ సంగీతంలో దశాబ్దానికి పైగా శిక్షణ పొందిన తాను తన స్వీయ అభివృద్ధికి విలువ ఇస్తానని పేర్కొన్నారు. బలాజ్స్ విరాగ్ పఖ్వాజ్ కచేరీ అందరినీ ఎంతో అలరించింది. విద్యా సంస్థల అధినేత సి.హెచ్. వి.కె నరసింహారావు మాట్లాడుతూ 47 సంవత్సరాలుగా విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నామని, దీంతోనే తమ విద్యార్థులు జిల్లా, రాష్ట్ర స్థాయిలోనే కాకుండా జాతీయ స్థాయి ప్రతిభా పరీక్షలు, పోటీల్లో ప్రతిభ చూపుతున్నారని తెలిపారు. తమ విద్యార్థులు దేశీయంగానే కాకుండా అంతర్జాతీయంగా రాణిస్తున్నారన్నారు. హాజరైన అతిథులకు విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సి.హెచ్ విజయ్ ప్రకాష్ జ్ఞాపికలు అందచేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ప్రిన్సిపల్ ఎం.వి.వి.ఎస్ మూర్తి, కన్వీనర్ సీతారాణి, ఏ.పి.పి.ఎస్.సి సభ్యుడు సోనీవుడ్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అభినందిస్తున్న విజయ్ ప్రకాష్

## ఫీల్డ్ అసిస్టెంట్ల వేతనాలు పెంచాలి

ప్రజాశక్తి-రావికమతం: ఉపాధి హామీలో పథకంలో పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు జీతభత్యాలు పెంచాలని రావికమతం మండల ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం గౌరవ అధ్యక్షులు వరహాలు కోరారు. ఈ సందర్భంగా దాసరి వరహాలు, మండల యూనియన్ అధ్యక్షుడు గణేష్, కార్యదర్శి శ్రీను తదితరులు మాట్లాడుతూ, గత నాలుగేళ్ల నుంచి ఫీల్డ్ అసిస్టెంట్లకు ఒక్క రూపాయి జీతం కూడా పెంచ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం ప్రజలతో మమేకమై క్షేత్రస్థాయిలో ప్రజలందరికీ ఉపాధి పని కల్పించి వలసల నివారణకు ఎంతో తోడ్పడుతు న్నామన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారానే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని, కానీ, తమను ప్రభుత్వం చిన్నచూపు చూడడం తగదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

## గంజాయి నియంత్రణపై ప్రచారం

ప్రజాశక్తి-పెదబయలు :మండలంలో వివిధ గ్రామాల్లో గంజాయి నిషేదించాలని జి.మాడుగుల సర్కిల్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో శనివారం ప్రచారం నిర్వహించారు. మండలంలో మారుమూల గోమాంగి, గుల్లెలు, కుమ్మరివీధి గ్రామాల్లో ప్రచారం చేశారు. గంజాయి పంట వద్దు వాణిజ్య పంటలే ముద్దు అంటూ నినాదాలు చేశారు.

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

**జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి హేమంత్**

ప్రజాశక్తి -నక్కపల్లి:సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి హేమంత్ సూచించారు. మండలంలోని గొడిచెర్ల పిహెచ్‌సిని శనివారం ఆయన సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు. ఆసుపత్రికి వచ్చిన రోగులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఆసుపత్రిలో ఉన్న మందులను పరిశీలించారు. మందులు కొరత రాకుండా ముందస్తుగా చూసుకోవాలన్నారు. డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాలపై డాక్టర్లు అప్రమత్తంగా ఉండాలని, వ్యాధి సోకిన రోగులను గుర్తించి సకాలంలో వైద్యం అందించాలని సూచించారు.సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.గునుపూడి గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంను సందర్శించారు. రోగులకు పూర్తిస్థాయిలో వైద్య సేవలను అందించాలని సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణపై చర్యలు చేపట్టాలన్నారు. పరిసరాల పరిశుభ్రత పై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు మురళీ కృష్ణారెడ్డి, సుకన్య, కిరణ్ ప్రసాద్, ఎంపిహెచ్ఈఓ రామకృష్ణ పాల్గొన్నారు .

మాట్లాడుతున్న హేమంత్